మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 15-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:21 | వెల రూ.2.00 PRICE: 2.00

సంపుటి: 1 Volume:1 || సంచిక: 316 Issue: 316

15 మే 2026 - శుక్రవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:48 సూర్యాస్తమయం - సా. 6:37 తిథి త్రయోదశి ఉ. 8:29 వరకు తరువాత చతుర్దశి తె. 5:11o వరకు సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం అశ్విని రా. 8:10 వరకు తరువాత భరణి యోగం ఆయుష్మాన్ మ. 2:16 వరకు కరణం వనిజ ఉ. 8:29 వరకు విష్టి సా. 6:50 వరకు వర్జ్యం సా. 4:36 నుండి సా. 6:03 వరకు దుర్ముహూర్తం ఉ. 8:21 నుండి ఉ. 9:13 వరకు మ. 12:38 నుండి మ. 1:29 వరకు రాహుకాలం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు యమగండం మ. 3:24 నుండి సా. 5:01 వరకు గుళికాకాలం ఉ. 7:24 నుండి ఉ. 9:00 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:12 నుండి తె. 5:00 వరకు అమృత ఘడియలు మ. 1:43 నుండి మ. 3:10 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana Published from Jagitial

"దేశం అభివృద్ధి చెందాలంటే కేవలం ప్రభుత్వాలు మాత్రమే కష్టపడితే సరిపోదు. ప్రజలు కూడా బాధ్యతతో ముందుకు రావాలి. ఒక కుటుంబం నిలబడటానికి ఆదాయం ఎంత అవసరమో, ఆ ఆదాయాన్ని సక్రమంగా వినియోగించడం అంతకంటే అవసరం."

# మన వంతుగా..!

# ...పొదుపును పాటిద్దాం

సంపాదన పెరగడం గొప్ప విషయం కావచ్చు. కానీ సంపాదించిన దానిని జాగ్రత్తగా వినియోగించడం, భవిష్యత్తు కోసం దాచుకోవడం, వృథాను తగ్గించడం ఇంకా గొప్ప విషయం.

ఇదే విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు మరోసారి గుర్తు చేశారు. దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక, పర్యావరణ సవాళ్లను దృష్టిలో ఉంచుకొని 11 అంశాల్లో పొదుపు పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ పిలుపు కేవలం ప్రభుత్వ ప్రకటన కాదు. ఇది భవిష్యత్ తరాలకు ఇచ్చే మార్గదర్శకం. కుటుంబ ఆర్థిక భద్రత నుంచి దేశ ఆర్థిక స్వావలంబన వరకు, నీటి సంరక్షణ నుంచి విద్యుత్ పొదుపు వరకు, ఆహార నియంత్రణ నుంచి ఇంధన వినియోగం వరకు - ప్రతి అంశం దేశ అభివృద్ధితో ముడిపడి ఉంది. అందుకే ఇప్పుడు ప్రజలంతా ఏకమై ఈ పొదుపు మంత్రాన్ని ఆచరణలో పెట్టాల్సిన సమయం వచ్చింది.

## దేశ భవిష్యత్తుకు అండగా ఉందాం

## జాతిని కాపాడే చర్యలు చేపడదాం

## అసలైన దేశభక్తిని నిరూపించుకుందాం

(ఈవార్తలు - స్పెషల్ డెస్క్)

ఒకప్పుడు భారతీయ కుటుంబాల్లో పొదుపు జీవన విధానంలో భాగంగా ఉండేది. ఇంట్లో పెద్దలు అవసరం లేని ఖర్చులను తగ్గించేవారు. ఒక వస్తువు పాడైతే వెంటనే కొత్తది కొనకుండా మరమ్మత్తు చేసేవారు. అన్నం వృథా కాకుండా చూసుకునేవారు. విద్యుత్ అవసరం లేని చోట లైట్లు ఆపేవారు. నీటిని బంగారం లా భావించేవారు. ప్రతి రూపాయి విలువ తెలిసిన జీవన విధానం ఉండేది. కానీ కాలం మారింది. వినియోగదారుల సంస్కృతి పెరిగింది. అవసరాల కంటే ఆకర్షణలకు ప్రాధాన్యం పెరిగింది. ఈఎంఐల సంస్కృతి, ఆన్‌లైన్ షాపింగ్, బ్రాండ్ల మోజు, ఫ్యాషన్ పోటీ, సోషల్ మీడియా ప్రభావం కారణంగా అనవసర ఖర్చులు విపరీతంగా పెరిగాయి. సంపాదన పెరిగినా, చేతిలో మిగిలేది తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో మోదీ ఇచ్చిన పొదుపు మంత్రం ఎంతో సమయోచితమైనది. ఇది కేవలం డబ్బు దాచుకోవాలని చెప్పే పిలుపు కాదు. బాధ్యతాయుత తరువాయి 2 వ పేజీలో...




రేపు అండమాన్‌కు

# నైరుతి!


ఐఎండీ నివేదిక 2

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,200 |
| వెండి (కిలో): | రూ.3,20,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,469 |

## విశ్వవాణి



ఇంటర్నెట్ వాడే సమయంలో పాప్ అప్ యాడ్స్ వస్తే క్లోజ్ బటన్ సరిగ్గా కనిపించాల్సిందేనని చైనా సర్కారు ఆదేశాలు జారీ చేసింది. తప్పుడు క్లోజ్ బటన్స్, కౌంట్ డౌన్ టైం, మల్టిపుల్ క్లిక్స్ వంటి జిమ్మిక్కులు చేస్తే కుదరదని, ఒకే క్లిక్‌లో క్లోజ్ అవ్వాలని స్పష్టం చేసింది.



# 'అకాల' మృత్యువు

## ఒక్కరోజే 100 మంది మృతి

యూపీలో అకాల వర్షాలు.. దాదాపు 60 మందికి గాయాలు

లక్నో: మండువేసవిలో ఉత్తరప్రదేశ్ అకాల వర్షాలతో అతలాకుతలమైంది. తీవ్రమైన గాలి దుమారం, భారీ వర్షం సృష్టించిన పెనుబీభత్సం కారణంగా రాష్ట్రంలో ఒక్కరోజే 100 మంది ప్రాణాలు కోల్పోయారు. క్యుములో నింబస్ మేఘాల ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగళ్ల వాన కురిసింది. గాలి దుమారం, వడగళ్ల వాన, పిడుగుల కారణంగా తరువాయి 2 వ పేజీలో...

# ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్

ఇంటర్ విద్యలో మార్పులు.. మ్యాథ్స్ సబ్జెక్టులోనూ చేంజెస్

హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యలో కీలక మార్పులు తీసుకువస్తూ నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, ఇంటర్మీడియట్ బోర్డు కలిసి ఈ మార్పులకు శ్రీకారం చుట్టాయి. 2026-2027 అకడమిక్ ఇయర్ నుంచే రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యలో ఈ సరికొత్త మార్పులు అమల్లోకి రానున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ కొత్త ఇంటర్ విద్యా విధానంలో భాగంగా.. మ్యాథమేటిక్స్ సబ్జెక్టుతోపాటు.. ప్రాక్టికల్స్ పరీక్షల మార్కుల్లో మార్పులు చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టుల్లో భయం లేకుండా.. వాటిపై మరింత ఆసక్తి పెంచేందుకే ఇంటర్ బోర్డు ఈ తరువాయి 2 వ పేజీలో...



# మైనరా.. మేజరా?



## 'బండి' బాధితురాలి పుట్టిన తేదేంటి?


బర్త్ సర్టిఫికెట్లు పరిశీలించండి.. అధికారులకు హైకోర్టు ఆదేశాలు

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. తనపై నమోదైన పోక్సో కేసును కొట్టివేయాలని కోరుతూ భగీరథ్ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. మధ్యంతర బెయిల్‌పై తీర్పును శుక్రవారం వెలువరిస్తామని హైకోర్టు వెల్లడించింది. ముందస్తు బెయిల్‌పై వచ్చేవారం విచారిస్తామని తెలిపింది. పిటిషనర్ తరపున న్యాయవాది నిరంజన్‌రెడ్డి, పోలీసుల తరపున పీపీ నాగేశ్వరరావు వాదనలు వినిపించారు.

హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): భగీరథ్ తరఫు న్యాయవాది నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ బాధితురాలి వయసుపై పలు అంశాలను కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. పోలీసుల ఛార్జ్‌షీట్‌లో ఆమె వయసు 15 ఏళ్లుగా పేర్కొన్నారన్నారు. కానీ.. జీహెచ్ఎంసీ జారీ చేసిన జనన ధ్రువీకరణ పత్రం (బర్త్ సర్టిఫికెట్)లో 2008 ఉందని.. పాన్ కార్డులో 2010 ఉందని తెలిపారు. 2021లో డ్రైవింగ్‌కు అర్హత లేకుండా పట్టుబడినపుడు బాధితురాలి వయసు 15 ఏళ్లు ఉందని కోర్టు దృష్టికి నిరంజన్‌రెడ్డి తీసుకెళ్లారు. ఛార్జ్‌షీట్, తరువాయి 2 వ పేజీలో...

# కేరళం సీఎంగా వీడీ సతీశన్

ప్రకటించిన ఏఐసీసీ



తిరువనంతపురం: కేరళం సీఎంగా వీడీ సతీషన్ నియామకమయ్యారు. ముఖ్యమంత్రిగా ఆయన పేరును కాంగ్రెస్ అధిష్ఠానం అధికారికంగా ప్రకటించింది. కేరళం ముఖ్యమంత్రి సీటుపై తొలి నుంచీ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. వీడీ సతీశన్, రమేశ్ చెన్నితాల, కేసీ వేణుగోపాల్ మధ్య తీవ్ర పోటీ నడిచింది. ఈ నేపథ్యంలోనే రాహుల్ గాంధీ సన్నిహితులైన కేసీ వేణుగోపాల్‌కు ముఖ్యమంత్రి పదవి దాదాపు ఖరారైనట్లేనని అంతా భావించారు. కాగా ఆశ్చర్యంగా ఆయనే పోటీ నుంచి తప్పుకోవడంతో వీడీ సతీశన్ పేరు అధిష్ఠానం ఖరారు చేసింది. సతీశన్ పూర్తిపేరు తరువాయి 2 వ పేజీలో...



# 'సర్' వస్తున్నారు!

దేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

గతేడాది బిహార్ ఎన్నికల సమయంలో తొలి విడత

ఇటీవల బెంగాల్, తమిళనాడులో రెండో దశ పూర్తి

మూడో దశలో 16 రాష్ట్రాలు, 3 యూటీల్లో నిర్వహణ

జూన్ 25 నుంచి తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా మూడో దశ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు కేంద్ర ఎన్నికల కమిషన్ గురువారం ఆదేశించింది. ఈ ప్రక్రియ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 16 రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల్లో మే 30 నుంచి డిసెంబరు 23 వరకు కొనసాగుతుందని తెలిపింది. ఏపీలో జూన్ 15 నుంచి సెప్టెంబర్ 22 వరకు, తెలంగాణలో జూన్ 25 నుంచి అక్టోబర్ 1 వరకు ఎస్ఐఆర్ జరగనుంది. ఓటర్ల జాబితా సవరణ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు



15.5.2026

మేషం: బంధుమిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. గృహమున మిత్రులతో ఆనందంగా గడుపుతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహం కలుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

వృషభం: వ్యాపారాలు, ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు ఉంటాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన వ్యవహారాలలో కుటుంబ సభ్యుల సలహాలు స్వీకరిస్తారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది.

మిధునం: సంతానం ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయటం మంచిది కాదు. వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగాలలో నిరాశ పెరుగుతుంది. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. కొన్ని వ్యవహారాలు వ్యయప్రయాసలతో కానీ పూర్తి కావు. వృధా ఖర్చులు ఉంటాయి.

కర్కాటకం: ఇంటా బయట పని ఒత్తిడి అధికమై శిరో బాధలు కలుగుతాయి. ప్రయాణాల్లో ఆటంకాలు ఉంటాయి. వ్యాపారాలలో చికాకులు అధికమవుతాయి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. ఆర్థిక వ్యవహారాలు నిరాశ కలిగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది.

సింహం: చేపట్టిన పనులలో కార్యజయం కలుగుతుంది. ఆప్తుల నుంచి కీలక సమాచారం సేకరిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. నూతన గృహ నిర్మాణ ప్రయత్నాలు ఫలిస్తాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వాహన యోగం ఉన్నది.

కన్య: చిన్ననాటి మిత్రుల నుండి ఆర్థిక సహాయం లభిస్తుంది. వ్యాపారాలలో సమస్యలు అధిగమిస్తారు. ఉద్యోగాలలో పని భారం నుండి ఉపశమనం లభిస్తుంది. ఆలయాలు సందర్శిస్తారు. ఇంటాబయట అనుకూల వాతావరణం ఉంటుంది. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి.

తుల: కుటుంబ సభ్యుల విషయంలో ముఖ్యమైన నిర్ణయాలలో ఆకస్మిక మార్పులు చేస్తారు. ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు చెయ్యవలసి వస్తుంది. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. నిరుద్యోగ యత్నాలు ముందుకు సాగవు.

వృశ్చికం: బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమ తప్ప ఫలితం కనిపించదు. సోదరులతో ఆస్తి వివాదాలు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

ధనస్సు: జీవిత భాగస్వామి ద్వారా ఆస్తి లాభ సూచనలు ఉన్నవి. ధనాదాయం బాగుంటుంది. సమాజంలో ప్రముఖులతో నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలు పుంజుకుంటాయి. చిన్న తరహా పరిశ్రమలకు నూతన అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగులు పనితీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. కుటుంబ పెద్దల ఆరోగ్యం విషయంలో కొంత శ్రద్ధ వహించాలి. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. ఆర్థిక పరిస్థితి నిరాశ కలిగిస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

కుంభం: మిత్రుల నుంచి వివాదాలకు సంబంధించి ముఖ్య విషయాలు తెలుస్తాయి. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. పలుకుబడి కలిగిన వారితో పరిచయాలు విస్తృతం అవుతాయి. చేపట్టిన వ్యవహారాలు సాఫీగా సాగుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి.

మీనం: ఆర్థిక ఇబ్బందులు అధిగమిస్తారు. వృత్తి వ్యాపారాలలో మీ శ్రమ ఫలిస్తుంది. ఆస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. గృహ నిర్మాణ ప్రయత్నాలు కార్యరూపం దాలుస్తాయి. చేపట్టిన పనులు చకచకా సాగుతాయి. ఉద్యోగులు ఉన్నతహోదాలు పొందుతారు. నిరుద్యోగులకు అధికారుల అనుగ్రహం కలిగి నూతన అవకాశాలు లభిస్తాయి.

# మన వంతుగా..!




**మొదటి పేజీ తరువాయి**

జీవన విధానాన్ని అవలంబించమనే సూచన. ప్రపంచవ్యాప్తంగా నీటి సంక్షోభం పెరుగుతోంది. భారతదేశంలో కూడా అనేక రాష్ట్రాలు తీవ్రమైన నీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయి. చెరువులు ఎండిపోతున్నాయి. వర్షపాతం అస్థిరంగా మారుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి చుక్క నీరు విలువైనదే. ఇంట్లో ట్యాపులు వృథాగా కారకుండా చూడటం నుంచి వర్షపు నీటి సంరక్షణ వరకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. వ్యవసాయంలో డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ పద్ధతులను ప్రోత్సహించాలి. పట్టణాల్లో వర్షపు నీటి నిల్వ తప్పనిసరి చేయాలి. నీటి వృథా అనేది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు. అది సమాజానికే ముప్పు. ఈరోజు మనం నీటిని వృథా చేస్తే రేపటి తరాలు దాహంతో బాధపడే పరిస్థితి వస్తుంది. దేశంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. పారిశ్రామిక రంగం, గృహ వినియోగం, సాంకేతిక రంగాల అభివృద్ధితో విద్యుత్ అవసరాలు విస్తరించాయి. అయితే విద్యుత్ ఉత్పత్తికి భారీ ఖర్చు అవుతోంది. ఇంట్లో అవసరం లేని లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు ఆన్‌లో ఉంచడం సాధారణ అలవాటుగా మారింది. విద్యుత్ పొదుపు అంటే బిల్లులు తగ్గించుకోవడం మాత్రమే కాదు. దేశ వనరులను కాపాడటం కూడా. ఎల్ఈడీ బల్బుల వినియోగం, సౌరశక్తి వినియోగం, విద్యుత్ సామర్థ్య పరికరాల వినియోగం పెరగాలి. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పరిశ్రమలు కూడా విద్యుత్ వినియోగంపై నియంత్రణ పాటించాలి. ఒక్క కుటుంబం రోజుకు కొద్దిపాటి విద్యుత్ పొదుపు చేసినా దేశ స్థాయిలో అది కోట్ల యూనిట్ల ఆదాగా మారుతుంది.

### ఇంధన పొదుపు.. ఆహార పొదుపు

భారతదేశం ఇప్పటికీ చమురు దిగుమతులపై భారీగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు పెరిగితే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోంది. వ్యక్తిగత వాహనాల వినియోగం పెరగడంతో ఇంధన వినియోగం విపరీతంగా పెరిగింది. అవసరం లేకపోయినా వాహనాలు ఉపయోగించడం, ట్రాఫిక్‌లో ఇంజిన్లు ఆఫ్ చేయకపోవడం, ప్రజా రవాణాను నిర్లక్ష్యం చేయడం వంటివి పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తున్నాయి. కార్పూలింగ్, ప్రజా రవాణా వినియోగం, సైక్లింగ్, ఎలక్ట్రిక్ వాహనాల ప్రోత్సాహం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించవచ్చు. ప్రతి లీటర్ పెట్రోల్ ఆదా అంటే దేశ విదేశీ మారక నిల్వలను కాపాడటమే. ఒకవైపు కోట్ల మంది ఆకలితో బాధపడుతుంటే మరోవైపు భారీగా ఆహారం వృథా అవుతోంది. వివాహాలు, విందులు, హోటళ్లు, ఇళ్లలో వృథా అయ్యే ఆహారం పరిమాణం ఆందోళనకరంగా ఉంది. మన ప్లేట్‌లో తీసుకున్న ఆహారాన్ని పూర్తిగా తినడం కూడా ఒక దేశభక్తి. అవసరమైనంత మాత్రమే వండుకోవడం, మిగిలిన ఆహారాన్ని అవసరమైన వారికి అందించడం, ఆహార వ్యర్థాలను తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత. పిల్లల్లో చిన్నప్పటి నుంచే ఆహారం విలువను నేర్పాలి. రైతు కష్టాన్ని గౌరవించే సంస్కృతి పెరగాలి.

### డబ్బు పొదుపు.. సమయం పొదుపు

ఇప్పటి తరంలో అప్పుల జీవితం పెరిగింది. సంపాదన కంటే ఖర్చులు అధికమవుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో చేతిలో డబ్బు లేక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. ప్రతి కుటుంబం ఆదాయంలో కొంత శాతం పొదుపు చేయాలి. చిన్న మొత్తమైనా నిరంతరం దాచుకుంటే భవిష్యత్తులో అది పెద్ద భరోసాగా మారుతుంది. బ్యాంకు డిపాజిట్లు, పోస్టాఫీస్ పథకాలు, బీమా, పెన్షన్ పథకాలు వంటి భద్రమైన మార్గాల్లో పొదుపు చేయాలి. పొదుపు ఉన్న కుటుంబం ఆర్థిక సంక్షోభాలను ధైర్యంగా ఎదుర్కోగలదు. పొదుపు లేని జీవితం ఎప్పుడూ అనిశ్చితితో నిండి ఉంటుంది. సమయం కూడా ఒక సంపదే. వృథా అయిన సమయం తిరిగి రాదు. సోషల్ మీడియా, నిరుపయోగపు అలవాట్లు, పనులలో ఆలస్యం కారణంగా మనుషులు విలువైన సమయాన్ని కోల్పోతున్నారు. సమయాన్ని సక్రమంగా వినియోగిస్తే వ్యక్తిగత అభివృద్ధి మాత్రమే కాదు, దేశ ఉత్పాదకత కూడా పెరుగుతుంది. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలి. ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలి. సమాజంలో సమయపాలన సంస్కృతి పెరగాలి. ఈ రోజు యువతలో వినియోగ సంస్కృతి అత్యధికంగా కనిపిస్తోంది. సోషల్ మీడియా ప్రభావంతో బ్రాండ్ల మోజు, ఫ్యాషన్ పోటీ, ఆడంబర జీవనం పెరుగుతున్నాయి. అవసరం లేని ఖర్చులు జీవితాన్ని అప్పుల బారిన పడేస్తున్నాయి. యువత పొదుపు విలువను అర్థం చేసుకోవాలి. సంపాదన మొదలైన వెంటనే పెట్టుబడులు, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవాలి. తాత్కాలిక ఆకర్షణల కోసం భవిష్యత్తును పణంగా పెట్టకూడదు. పిల్లలకు చదువు మాత్రమే కాదు, జీవన విలువలు కూడా నేర్పాలి. నీటి విలువ, ఆహారం విలువ, డబ్బు విలువ, సమయం విలువ తెలియజేయాలి. పిల్లలకు చిన్న మొత్తాల్లో పొదుపు అలవాటు చేస్తే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారు. పాఠశాలల్లో కూడా ఆర్థిక అవగాహన, వనరుల సంరక్షణపై ప్రత్యేక పాఠాలు ఉండాలి.

### ప్రజలూ మారాలి

ప్రభుత్వాలు ఎన్నో పథకాలు తీసుకొస్తాయి. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. కానీ ప్రజలు సహకరించకపోతే ఫలితం ఉండదు. నీటి సంరక్షణపై చట్టాలు తెచ్చినా ప్రజలు వృథా చేస్తే ప్రయోజనం లేదు. విద్యుత్ పొదుపు పథకాలు ఉన్నా నిర్లక్ష్యం చేస్తే ప్రయోజనం లేదు. అందుకే ప్రతి పౌరుడు బాధ్యత తీసుకోవాలి. దేశాభివృద్ధి అనేది ప్రభుత్వం ఒక్కదాని బాధ్యత కాదు. ప్రజల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. పొదుపు అనేది వ్యక్తిగత అలవాటు స్థాయిలోనే కాకుండా సామాజిక ఉద్యమంగా మారాలి. గ్రామ సభలు, కాలనీలు, పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు.. ఇలా ప్రతి స్థాయిలో అవగాహన కార్యక్రమాలు జరగాలి. నీటి సంరక్షణ పోటీలు, విద్యుత్ పొదుపు కార్యక్రమాలు, ఆహార వ్యర్థాల నియంత్రణ చర్యలు చేపట్టాలి. మీడియా కూడా బాధ్యతగా వ్యవహరించి ప్రజల్లో అవగాహన పెంచాలి. కొంతమంది పొదుపును పిసినారితనంగా భావిస్తారు. ఇది తప్పు. పొదుపు అనేది తెలివైన జీవన విధానం. అవసరం లేని ఖర్చులను తగ్గించి అవసరమైన చోట వినియోగించడం. అమెరికా, జపాన్, జర్మనీ వంటి అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా వనరుల వినియోగంపై కఠిన నియంత్రణ ఉంటుంది. మన దేశంలో కూడా ఆ సంస్కృతి రావాలి. దేశభక్తి అంటే కేవలం నినాదాలు చేయడం కాదు. దేశ సంపదను కాపాడటం కూడా దేశభక్తే. నీరు ఆదా చేయడం, విద్యుత్ పొదుపు చేయడం, పన్నులు సక్రమంగా చెల్లించడం, ఆహారం వృథా చేయకపోవడం.. ఇవన్నీ నిజమైన దేశసేవే.

# ‘అకాల’ మృత్యువు

**మొదటి పేజీ తరువాయి**

మే 13న పలు జిల్లాలు అతలాకుతలమయ్యాయి. ఈ వర్షాల కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో 100 మంది మృతిచెందారు. మరో 60 మందికిపైగా గాయపడ్డారు. 114 జంతువులు మరణించాయి. 87 ఇళ్లు ధ్వంసమయ్యాయి. యూపీ రిలీఫ్ కమిషనర్ కార్యాలయం ఈ విషయాలను వెల్లడించింది. అకాల వర్షాలవల్ల జరిగిన ఆస్తి, ప్రాణనష్టంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆరాతీశారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సీఎం సమీక్షిస్తున్నారని, వర్ష ప్రభావిత జిల్లాల్లో ముమ్మర సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రయాగ్‌రాజ్, భదోహి, సోన్‌భద్ర, ఫతేపూర్ తదితర జిల్లాల్లో గాలివాన బీభత్సం జరిగింది. ప్రయాగ్‌రాజ్‌లో 21 మంది, భదోహిలో 16 మంది, ఫతేపుర్‌లో 11 మంది, సంత్ రవిదాస్ నగర్‌లో 14 మంది, మీర్జాపుర్‌లో 10 మంది మృతి చెందినట్లు ఆయా జిల్లాల యంత్రాంగాలు వెల్లడించాయి. ఆయా జిల్లాల్లో అనేక చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సాధారణంగా మే నెలలో ఉత్తర భారతంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. చాలాచోట్ల సగటు ఉష్ణోగ్రత 40 డిగ్రీల పైనే ఉంటుంది. ఆ సమయంలో భూఉపరితలంపై ఉండే గాలి విపరీతంగా వేడెక్కుతుంది. అది వేగంగా కదులుతూ ఇతర దిశల నుంచి తడిగాలిని లాగేసుకుంటుంది. ఈ రెండు కలిసి ఆకాశంలో చాలా ఎత్తుకు చేరినప్పుడు క్యుములోనింబస్ మేఘాలు ఏర్పడతాయి. దట్టమైన నల్లటి మబ్బులు ఆకాశమంతా విస్తరిస్తాయి. ఆ తర్వాత తక్కువ సమయంలోనే భారీ వర్షం, వడగళ్లు, పిడుగులు పడుతాయి. ఇప్పుడు యూపీలో ఇలాంటి పరిస్థితే ఏర్పడిందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. బరేలీ జిల్లాలో బలమైన ఈదురు గాలుల కారణంగా ఓ వ్యక్తి పతంగిలా పైకి ఎగిరి కింద పడ్డాడు. గాలిదుమారం రావడంతో సదరు వ్యక్తి ఓ షెడ్డును పట్టుకుని నిలబడ్డాడు. అయితే గాలి తీవ్రతకు షెడ్డుతో సహా ఎగిరిపడ్డాడు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ ఘటనలో తీవ్ర గాయపడిన అతడికి ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

## ఫస్టియర్‌లోనూ ప్రాక్టికల్స్

**మొదటి పేజీ తరువాయి**

నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నాయి. ఇక ఇప్పటివరకు ఇంటర్మీడియట్‌లో కేవలం సెకండ్ ఇయర్‌లో మాత్రమే ప్రాక్టికల్ ఎగ్జామ్స్ ఉండేవి. కానీ తాజాగా తీసుకువచ్చిన మార్పుల ప్రకారం.. ఫస్టియర్ నుంచే ప్రాక్టికల్స్‌ను నిర్వహించనున్నారు. ఇప్పటిదాకా.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో 30 మార్కుల చొప్పున సెకండియర్‌లో ప్రాక్టికల్స్ ఉండేవి. అయితే వీటిని ఫస్టియర్‌లో 15 మార్కులు, సెకండియర్‌లో 15 మార్కుల చొప్పున ప్రాక్టికల్స్‌కు విడగొట్టారు. ఈ నిర్ణయం వల్ల ఫస్టియర్ నుంచే విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై పట్టు ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఇంటర్మీడియట్‌లో కీలక సబ్జెక్ట్ అయిన మ్యాథ్స్‌లో కూడా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. మ్యాథ్స్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల ప్రతి సంవత్సరం మ్యాథ్స్ సబ్జెక్టులో 15 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా వేయనున్నారు. ఇక ఫైనల్ పరీక్షల్లో మ్యాథ్స్ సబ్జెక్టుకు ఇప్పటివరకు 75 మార్కులు ఉండగా.. 15 మార్కులను తీసేసి.. ఇక నుంచి 60 మార్కులకు మాత్రమే పరీక్షను నిర్వహించేలా ఇంటర్ బోర్డు తాజాగా కీలక మార్పులు చేసింది. మరోవైపు.. లాంగ్వేజీ పరీక్షల్లో కూడా కీలక మార్పులను ప్రవేశపెట్టారు. ఇంగ్లీష్, తెలుగు లేదా సంస్కృతం సబ్జెక్టులకు కూడా 100 మార్కులకు బదులుగా 80 మార్కులకే పరిమితం చేయాలని ఇంటర్ బోర్డు నిర్ణయించింది. మిగిలిన 20 మార్కులను ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా విద్యార్థులకు వేయనున్నారు. ఇంటర్‌లో విద్యార్థులు బట్టీపట్టే విధానాన్ని తగ్గించి.. వారికి జ్ఞాపకశక్తిని పెంపొందించేలా.. ప్రాక్టికల్స్ స్కిల్స్‌ను పెంచడమే లక్ష్యంగా ఈ కొత్త విద్యావిధానాన్ని తీసుకువచ్చినట్లు ఇంటర్ బోర్డు స్పష్టం చేసింది.

## మైనరా.. మేజరా?

**మొదటి పేజీ తరువాయి**

పాన్‌కార్డులో పుట్టినతేదీలు ఒక్కోలా ఎందుకున్నాయని హైకోర్టు ప్రశ్నించింది. జనన ధ్రువపత్రాలు పరిశీలించాలని పోలీసులను ఆదేశించింది. మరోవైపు, బండి భగీరథ్‌ను క్రిమినల్ అని బాధితురాలి తరఫు న్యాయవాది సంబోధించగా.. పిటిషనర్ తరఫు న్యాయవాది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇరువురి మధ్య వాగ్వాదంతో న్యాయమూర్తి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నేర నిరూపణ అయ్యేవరకు క్రిమినల్ అనకూడదని హైకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాదులకు సంయమనం లేకపోతే పిటిషన్‌ను మరో బెంచ్‌కు మార్చుకోవచ్చని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. న్యాయవాదులు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. దీంతో న్యాయవాదులు శాంతించారు.

## ‘సర్’ వస్తున్నారు!

**మొదటి పేజీ తరువాయి**

ప్రక్రియ కోసం ప్రత్యేకంగా బూత్ లెవల్ ఆఫీసర్ల నియామకం, శిక్షణా తరగతులు నిర్వహిస్తారు. అనంతరం 2002 జాబితా ప్రకారం ఓటర్ల సవరణకు ఈసీ సిద్ధమైంది. అయితే, తమ ఓటును కోల్పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఓటర్‌దేనని ఈసీ స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్ జూన్ 5 నుంచి 14 వరకు సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఆ తర్వాత జూన్ 15 నుంచి జులై 14 వరకు వారు ఇంటింటికీ వెళ్లి వివరాలను సేకరించనున్నారు. అనంతరం జులై 21న ముసాయిదా జాబితా వెల్లడించారు. ఆగస్టు 20 వరకు అభ్యంతరాలను స్వీకరించి, మార్పులు చేర్పుల అనంతరం సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. ఇక, తెలంగాణలో జూన్ 15 నుంచి 24 వరకు శిక్షణ, జూన్ 25 నుంచి జులై 24 వరకు ఇంటింటి సర్వే జరుగుతుంది. జులై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించి.. అదే రోజు నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబర్ 1న తుది జాబితా ప్రకటించనున్నారు. ప్రస్తుత జనగణన (జవఅంబం) హౌస్ లిస్టింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని ఫేజ్-3 షెడ్యూల్ ఖరారు చేసింది. మూడో దశ భాగంగా 3.94 లక్షల మంది బూత్ లెవల్ అధికారులు.. 36.73 కోట్ల మంది ఓటర్ల వద్దకు ఇంటింటికీ వెళ్లనున్నారు. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ాx= షెడ్యూల్ వాయిదా వేసింది. త్వరలోనే కొత్త తేదీలను ప్రకటిస్తామని చెప్పింది. అలాగే, పారదర్శకత కోసం ప్రతి పోలింగ్ బూత్‌కు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించాలని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేసింది. ఈ దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, ఒడిశా, ఉత్తరాఖండ్, అరుణాచల్ ప్రదేశ్, మిజోరాం, మణిపూర్, హర్యానా, పంజాబ్, కర్ణాటక, మేఘాలయ, మహారాష్ట్ర, ఝార్ఖండ్, నాగాలాండ్, త్రిపుర, ఛండీగఢ్, దాదర్ నగర్ హవేలీ, దమన్ దయ్యూలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతుంది. మొదటి రెండు దశల్లో 13 రాష్ట్రాల్లో 59 కోట్ల మంది ఓటర్లను ఎన్నికల కమిషన్ కవర్ చేసింది.

## కేరళం సీఎంగా వీడీ సతీశన్

**మొదటి పేజీ తరువాయి**

వడక్కేయిల్ దామోదరన్ సతీశన్, నెట్టూరు, ఎర్నాకులం జిల్లాలో మే 31, 1964న జన్మించారు. పనంపిల్లి నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. వృత్తిరీత్యా న్యాయవాదైన సతీశన్.. ఎన్ఎస్‌యూఐ ద్వారా విద్యార్థి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఎమ్మెల్యేగా 2001లో మొదటిసారిగా పారావూర్ నియోజకవర్గం నుంచి కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. అప్పటి నుంచి వరుసగా ఐదుసార్లు (2001, 2006, 2011, 2016, 2021) అదే నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. అనంతరం 2021లో కేరళ అసెంబ్లీ ఎన్నికల తర్వాత, రమేష్ చెన్నితాల స్థానంలో ఆయనను కేరళ శాసనసభ ప్రతిపక్ష నాయకుడిగా కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. అప్పటి నుంచి రాష్ట్ర సమస్యలపై గత ప్రభుత్వాన్ని పలుసార్లు ఎండగడుతూ వచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

## రేపు అండమాన్‌కు నైరుతి!

**మొదటి పేజీ తరువాయి**

న్యూఢిల్లీ: అధిక ఉష్ణోగ్రతల కారణంగా ఎండలకు అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ కేంద్రం చల్లటి కబురు చెప్పింది. రానున్న రెండు రోజుల్లో నైరుతి రుతుపవనాలకు వాతావరణం అనుకూలంగా ఉందని, మరో రెండ్రోజుల్లో నైరుతి రుతుపవనాలు అండమాన్‌ను తాకొచ్చని తెలిపింది. తుపాను వలయం సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల వరకు విస్తరించిందని, రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశముందని పేర్కొంది. ఎన్నడూ లేనివిధంగా ఈసారి ఎండలు మండిపోతున్నాయి. కొన్నిచోట్ల అకాల వర్షాలు పడుతున్నప్పటికీ, కాసేపటికి లేదా మరుసటి రోజు ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో నైరుతీ రుతుపవనాలు రానున్నయని వాతావరణ శాఖ తెలిపింది. మే 16 నాటికి నైరుతి రుతు పవనాలు అండమాన్ నికోబార్ చేరుకోవచ్చని అంచనా వేసింది. వాతావరణ శాఖ ప్రకారం, మే 19 వరకు అండమాన్ నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.




# సనత్‌నగర్ టిమ్స్ రెడీ

**ప్రారంభానికి సిద్ధంగా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్.. జూన్‌లో ప్రారంభోత్సవానికి సన్నాహాలు.. ఏర్పాట్లపై మంత్రి రాజనర్సింహ సమీక్ష**

హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): సనత్‌నగర్ టిమ్స్‌లో జరుగుతున్న వైద్య సేవల ట్రయల్ రన్, డాక్టర్లు, సిబ్బంది నియామకంపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. గురువారం సాయంత్రం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్‌లో జరిగిన ఈ సమావేశంలో రోడ్లు-భవనాలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. హాస్పిటల్ ప్రారంభోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు వేగంగా పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా సనత్ టిమ్స్‌కు సంబంధించిన పలు అంశాలను రోడ్లు, భవనాల శాఖ అధికారులు మంత్రికి వివరించారు. 2014లో తెలంగాణ ఏర్పడగా.. సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణానికి 2022 ఏప్రిల్‌లో అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ జీవో ఇచ్చారని అధికారులు తెలిపారు. 2022 చివరిలో సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులను కాంట్రాక్ట్ సంస్థకు అప్పటి ప్రభుత్వం అప్పగించిందని వెల్లడించారు. 2025 ఏప్రిల్ 7వ తేదీ నాటికి పనులు పూర్తి చేయాలని నాటి ప్రభుత్వం గడువు విధించిందన్నారు. 2023 ఫిబ్రవరి 8వ తేదీన సనత్‌నగర్ టిమ్స్ నిర్మాణ పనులను నిర్మాణ సంస్థ ప్రారంభించిందని వివరించారు. 2023 డిసెంబర్ 7వ తేదీ నాటికి స్లాబులు, బయటి గోడల నిర్మాణం వంటి కేవలం 13.14శాతం పని మాత్రమే పూర్తి అయిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి టిమ్స్ నిర్మాణ పనులపై సమీక్ష చేసి పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారని అధికారులు గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో భవన నిర్మాణ పనులు, ఎక్విప్‌మెంట్ కొనుగోలు తదితర పనులన్నీ పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం కొన్ని పనులు మాత్రమే మిగిలి ఉన్నాయని, మరో 15 రోజుల్లో వాటిని కూడా పూర్తి చేస్తామని అధికారులు వివరించారు. టిమ్స్ నిర్మాణ వ్యయాన్ని అడ్డగోలుగా పెంచితే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాస్త్రీయంగా అంచనా వేయించి ప్రజాధనం వృథాను అరికట్టారని మంత్రి గుర్తు చేశారు. ప్రజలకు అత్యాధునిక వసతులతో కూడిన మెరుగైన వైద్య సేవలు అందించేందుకు టిమ్స్, ఉస్మానియా వంటి హాస్పిటళ్లను



ఏర్పాటు చేస్తున్నామన్నారు. టిమ్స్‌లో ఎటువంటి లోటుపాట్లు ఉన్నా ఇప్పుడే సరిదిద్దాలని అధికారులకు మంత్రి సూచించారు. హాస్పిటల్‌లో మౌలిక సదుపాయాలు, వైద్య పరికరాల ఏర్పాటు, సిబ్బంది సంసిద్ధత, రోగులకు అందించాల్సిన సేవలపై మంత్రి ఆరా తీశారు. ప్రారంభోత్సవానికి ముందే అన్ని పనులు పూర్తి చేసి, ప్రజలకు పూర్తి స్థాయి సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## అక్రమార్కులకు అడ్డాగా స్త్రీనిధి సంస్థ

**సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలి**

**మంత్రి సీతక్కకు కవిత వినతి**

హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): మంత్రి సీతక్కకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక విజ్ఞప్తి చేశారు. ఆమె శాఖలో జరుగుతున్న అక్రమాలపై స్పందించాలని కోరారు. స్త్రీనిధిలో అక్రమాలకు కేంద్ర బిందువైన సంస్థ ఎండీపై చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ మేరకు కవిత 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు. మహిళల ఆర్థిక సాధికారతకు తోడ్పాటునివ్వాల్సిన స్త్రీనిధి సంస్థ అక్రమార్కులకు అడ్డంగా మారిందని ఆరోపించారు. సంస్థను తన గుప్పెట్లో పెట్టుకుని అనేక అక్రమాలకు కారకుడైన ఎండీ, ఇప్పుడు దొడ్డిదారిన సంస్థకు ఎక్స్ అఫీషియో ఛైర్మన్ పదవిని కొట్టేయడానికి స్కెచ్ వేశారని ఆరోపించారు. ప్రభుత్వ పెద్దల అండదండలతో ఈ నెల 16వ తేదీన స్త్రీనిధి ఉద్యోగుల సమావేశంలో ఎక్స్ అఫీషియో చైర్మన్ పోస్టును తీసుకోవడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని పేర్కొన్నారు. సదరు ఎండీ పదవీకాలం ఈ నెల 23వ తేదీతో ముగియనుందని, దీంతో ఆయన సంస్థను ఎలాగైనా తన అధీనంలోనే ఉంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు.

# సుబోధ్ సింగ్ గ్యాంగ్ పనే

**కరీంనగర్ జ్యువెలరీ దోపిడీ మిస్టరీ వీడింది!**

**ముగ్గురు నిందితుల అరెస్ట్**

**బీహార్ జైలు నుంచే ప్రధాన సూత్రధారి పథకం**

**మొత్తం 13 మంది నిందితుల గుర్తింపు**



కరీంనగర్, మే 14 (ఈవార్తలు): కరీంనగర్ పట్టణంలో పట్టపగలే జరిగి సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ షాపు దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ దోపిడీకి పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠా 'సుబోధ్ సింగ్ గ్యాంగ్'కు చెందిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మీడియా సమావేశంలో ప్రకటించారు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులను గుర్తించామని, మిగిలిన వారి కోసం గాలింపు ముమ్మరంగా కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. ఈ నెల 3న జరిగిన ఈ దోపిడీలో దుండగులు జ్యువెలరీ షాపులోకి చొరబడి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులకు బుల్లెట్ గాయాలయ్యాయి. దుండగులు 161 తులాల బంగారు ఆభరణాలు, 112 క్యారెట్ల వజ్రాలను దోచుకెళ్లారు. ఈ దోపిడీకి ప్రధాన సూత్రధారి సుబోధ్ సింగ్ అని, ప్రస్తుతం అతను బీహార్‌లోని పూర్నియా జైలులో ఉంటూనే ఈ మొత్తం కుట్రకు పథక రచన చేశాడని కమిషనర్ తెలిపారు. సుబోధ్ సింగ్ ముఠాకు బీహార్, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో దోపిడీలు చేసిన చరిత్ర ఉందని, ఇంత పకడ్బందీగా తెలంగాణలో దోపిడీ చేయడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో దోపిడీకి నాయకత్వం వహించిన పశ్చిమ బెంగాల్ వాసి రఘునాథ్ కర్మకార్‌ను, అలాగే రవిష్ కుమార్, మెహతాబ్ ఖాన్‌లను బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో ఇద్దరు షూటర్లు కాగా, మరొకరు వారికి సహాయం అందించిన వ్యక్తి. దోపిడీకి రెండు నెలల ముందే నిందితులు ఖమ్మం, మంచిర్యాల, పెద్దపల్లి, జగిత్యాల వంటి ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి, చివరకు కరీంనగర్‌ను ఎంచుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దోపిడీ అనంతరం బైక్‌లపై ధర్మపురికి చేరుకుని, అక్కడి నుంచి మూడు బృందాలుగా విడిపోయి రైళ్లు, బస్సుల ద్వారా పరారయ్యారు. నిందితుల నుంచి రూ. 51,000 నగదు, రెండు మొబైల్ ఫోన్లు, రెండు సిమ్ కార్డులు, నకిలీ ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు కొనసాగుతున్నందున పరారీలో ఉన్న నిందితుల వివరాలు వెల్లడించలేమని కమిషనర్ తెలిపారు. మిగిలిన వారిని పట్టుకునేందుకు వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, అలాగే జైలులో ఉన్న సుబోధ్ సింగ్‌ను విచారించేందుకు కోర్టు అనుమతి కోరతామని ఆయన వివరించారు.

## ఉదయనిధిపై రాష్ట్రపతికి ఫిర్యాదు

**తెలంగాణ న్యాయవాది కంప్లెయింట్**

చెన్నై: తమిళనాడు మాజీ ఉప ముఖ్యమంత్రి, డీఎంకే శాసనసభాపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మంపై చేసిన వ్యాఖ్యలు మళ్లీ విమర్శలపాలు అవుతున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం కార్యక్రమం సందర్భంగా కూడా సభలో ఆయన సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారు. గతంలో కూడా సనాతన ధర్మంపై ఆయన చాలా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మం మలేరియా, డెంగీ వంటిదని... దాన్ని అంతం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ వ్యాఖ్యల ప్రభావం డీఎంకేపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఎన్నికల్లో డీఎంకే ఓడిపోవడానికి ఈ వ్యాఖ్యలు కూడా ఒక ప్రధాన కారణమే. మరోవైపు సనాతనంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది రామారావు ఏకంగా భారత రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. రాష్ట్రపతి కార్యాలయంలో ఉదయనిధి స్టాలిన్‌పై అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఉదయనిధి వ్యాఖ్యలు కేవలం ఒక భావప్రకటన మాత్రమే కాదని, అవి కోట్లాది మంది హిందువుల మత విశ్వాసాలను తీవ్రంగా గాయపరిచేలా ఉన్నాయని ఆయన తన ఫిర్యాదులో పేర్కొన్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన విమర్శలు సమాజంలో విద్వేషాలను పెంచే ప్రమాదం ఉందని రామారావు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, ఆయన చేసిన ఆ వివాదాస్పద వ్యాఖ్యలు మీడియాలో కానీ, డిజిటల్ సోషల్ మీడియా వేదికల్లో కానీ ప్రసారం కాకుండా తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన రాష్ట్రపతిని అభ్యర్థించారు.



## 2 విమానాల దారి మళ్లింపు

శంషాబాద్, మే 14 (ఈవార్తలు): హైదరాబాద్ లో వాతావరణం ఒక్కసారిగా మారడం వల్ల శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. నగర శివార్లలో ఆకాశం మేఘావృతమై, ల్యాండింగ్‌కు అవసరమైన స్పష్టత లేకపోవడంతో, భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు రెండు కీలక విమానాలను దారి మళ్లించారు. పూణె – హైదరాబాద్ (ఇండిగో) విమానాన్ని విజయవాడలోని గన్నవరం ఎయిర్‌పోర్టుకు మళ్లించి అక్కడ సురక్షితంగా ల్యాండ్ చేయించారు. దుబాయ్ – హైదరాబాద్ (ఎమిరేట్స్) అంతర్జాతీయ విమానాన్ని బెంగళూరు విమానాశ్రయానికి డైవర్ట్ చేశారు. ఈ పరిణామాలతో ప్రయాణికులు చాలా ఇబ్బందికి గురయ్యారు. ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు మెరుగుపడిన తర్వాత, ఈ రెండు విమానాలు తిరిగి శంషాబాద్ చేరుకోవడంతో ప్రయాణికులు, వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు.

# వాహనాలకూ క్రమశిక్షణ!

**అక్రమ పార్కింగ్ వాహనాల స్వాధీనం**

**టోయింగ్, పార్కింగ్ ఛార్జీలతో పాటు పాత చలాన్ల చెల్లింపు తప్పనిసరి**

**నిర్ణీత గడువులోగా తీసుకోకపోతే వాహనాల వేలం**

**కొత్త పార్కింగ్ పాలసీకి టీజీ సన్నాహాలు**



హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): తెలంగాణలో వాహనాల పార్కింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. రోడ్లపై అడ్డగోలుగా వాహనాలు నిలపడం, రోజుల తరబడి వదిలేయడం వంటి చర్యలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో పాటు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర రవాణా శాఖ కొత్త పార్కింగ్ పాలసీ ముసాయిదాను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు రూపుదిద్దుకున్న ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, వాహనదారుల జేబుకు చిల్లు పడటమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే వాహనాన్ని కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. ఈ ముసాయిదాలోని నిబంధనల ప్రకారం ఇకపై ఎక్కడపడితే అక్కడ వాహనాన్ని పార్క్ చేస్తే కేవలం జరిమానాతో వదిలిపెట్టరు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా, ఫుట్‌పాత్‌లపై, నో పార్కింగ్ జోన్లలో ఉన్న వాహనాలను అధికారులు వెంటనే టోయింగ్ చేసి స్వాధీనం చేసుకుంటారు. వాహన యజమాని తన బండిని తిరిగి పొందాలంటే టోయింగ్ ఛార్జీలు, వాహనాన్ని యార్డులో ఉంచినన్ని రోజులకు రోజువారీ పార్కింగ్ ఫీజు చెల్లించాలి. అంతేగాక ఆ వాహనంపై ఉన్న పెండింగ్ చలాన్లు, ఇతర జరిమానాలు మొత్తం చెల్లించిన తర్వాతే వాహనాన్ని అప్పగిస్తారు. ఈ కొత్త విధానంలో అత్యంత కీలకమైన అంశం వాహనాల వేలం. అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాన్ని నెల నుంచి 45 రోజుల్లోగా యజమాని క్లెయిమ్ చేసుకోకపోతే, ఆ వాహనాన్ని ప్రభుత్వపరం చేసి బహిరంగ వేలం వేసే అధికారం అధికారులకు ఉంటుంది. ఇలా స్వాధీనం చేసుకున్న వాహనాలను భద్రపరిచేందుకు పీపీపీ పద్ధతిలో ప్రత్యేక పార్కింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కూడా రవాణా శాఖ ప్రతిపాదించింది. నిర్బంధించిన వాహనాలకు విధించే రోజువారీ పార్కింగ్ ఫీజులను కూడా ముసాయిదాలో స్పష్టంగా పేర్కొన్నారు. ప్రాంతాలను బట్టి ఈ ఛార్జీలు మారతాయి. ద్విచక్ర వాహనానికి రోజుకు రూ.20 నుంచి రూ.30, ఆటోకు రూ.35 నుంచి రూ.50, కారుకు రూ.60 నుంచి రూ.80, బస్సు లేదా లారీకి రూ.200 నుంచి రూ.300 వరకు వసూలు చేయాలని ప్రతిపాదించారు.

# వీహెచ్ బాధ్యతల స్వీకరణ

**మంత్రులు పొన్నం, దుద్దిళ్ల, శ్రీహరి తదితరుల హాజరు**



హైదరాబాద్, మే 14 (ఈవార్తలు): కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి. హనుమంతరావు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ సలహాదారుగా బాధ్యతలను స్వీకరించారు. తెలంగాణ సచివాలయంలో గురువారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వీహెచ్ కి మాజీమంత్రి జానారెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, వాకిటి శ్రీహరి, టీపీసీసీ ఓబీసీ చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, రాజ్ ఠాకూర్ లు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర చైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత వి.హన్మంతరావు అని, ఆయన బలహీన వర్గాలకు న్యాయం చేయలని ముందుకు వెళ్తున్న సందర్భంలో వారి సలహాలు సూచనలు స్వీకరిస్తామని, బలహీన వర్గాల హక్కుల కోసం అందరం కలిసి పని చేస్తామన్నారు.

**రజక కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అజయ్ బాధ్యతలు**


రాష్ట్ర రజక కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గా దాసరిరాజు అజయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం మాసబ్ ట్యాంక్ డీఎస్ఎస్ భవన్ లో అజయ్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భొంగా ఆయనకు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, పలువురు రాజకీయ ప్రముఖులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రజక వృత్తి మారుతున్న కాలానికి అనుగుణంగా ఉండాలని, మొదటి దశలో 119 నియోజకవర్గాల్లో అధునాతన మోడర్న్ డ్రైక్లినింగ్ సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం రజకులకు ప్రారంభించిన 250 యూనిట్ల ఉచిత విద్యుత్ కు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగిస్తున్నామని, తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రజక వృత్తి అభివృద్ధి చెందుతూ విద్యా, ఉపాధి అవకాశాలు మెరుగుపడేల చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పొన్నం తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నియోజకవర్గానికి ఒకటి ఆధునిక దోభిఘాట్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

# ఢిల్లీ సర్కారు వర్క్ ఫ్రం హోం

**రెండ్రోజులు ఇంటి నుంచే డ్యూటీ.. వారానికి ఒక రోజు నో కార్ డే.. ప్రధాని మోదీ పిలుపుతో నిర్ణయం**

న్యూఢిల్లీ: పొదుపు చేయాలంటూ దేశ ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునకు ఢిల్లీ సర్కారు స్పందించింది. సీఎం రేఖా గుప్తా ప్రభుత్వం ఇంధన పొదుపు కోసం పలు కీలకమైన, ఆచరణాత్మక చర్యలను ప్రకటించింది. పెరుగుతున్న అంతర్జాతీయ ఇంధన ధరల నేపథ్యంలో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యంగా గురువారం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు ప్రభుత్వ కార్యాలయాల పనితీరు, ఉద్యోగుల ప్రయాణ అలవాట్లలో గణనీయమైన మార్పులు తీసుకురానున్నాయి. ప్రభుత్వం తీసుకున్న ప్రధాన నిర్ణయాలలో ప్రభుత్వ ఉద్యోగులకు వారానికి రెండు రోజులు ఇంటి నుంచి పని (వర్క్ ఫ్రమ్ హోమ్) చేసే వెసులుబాటు కల్పించడం ఒకటి. దీనివల్ల రోజూ కార్యాలయాలకు వచ్చివెళ్లే ప్రయాణాలు తగ్గి, ఇంధన వినియోగం గణనీయంగా తగ్గుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తోడు, ప్రభుత్వ శాఖలు నిర్వహించే సమావేశాలలో 50 శాతం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లోనే జరపాలని ఆదేశించింది. తద్వారా అనవసర ప్రయాణాలను పూర్తిగా నివారించవచ్చు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఢిల్లీ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ) కార్యాలయాల పనివేళల్లో మార్పులు చేయనున్నారు. వ్యయ నియంత్రణలో భాగంగా మరిన్ని కఠిన నిర్ణయాలు కూడా తీసుకున్నారు. అధికారులకు కేటాయించే అధికారిక వాహనాల నెలవారీ పెట్రోల్ పరిమితిపై 20 శాతం కోత విధించారు. అలాగే, రాబోయే ఆరు నెలల పాటు ప్రభుత్వ అవసరాలకు ఎలాంటి కొత్త వాహనాలను కొనుగోలు చేయరాదని స్పష్టం చేశారు. పర్యావరణ స్పృహ, వ్యక్తిగత బాధ్యతను పెంపొందించేందుకు ప్రభుత్వ ఉద్యోగులంతా వారానికి ఒకరోజు 'నో-కార్ డే' పాటించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. సాధారణ ప్రజలు కూడా దీన్ని స్వచ్ఛందంగా పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ప్రజా రవాణాను ప్రోత్సహించడం కూడా ఈ చర్యలలో కీలక భాగం. ఉద్యోగులు, ప్రజలు మెట్రో రైళ్లను ఎక్కువగా ఉపయోగించుకునేలా 'మెట్రో డే'ను నిర్వహించనున్నారు. అంతేకాకుండా, 29 ప్రభుత్వ ఉద్యోగుల నివాస కాలనీల నుంచి కార్యాలయాలకు రాకపోకలు సాగించేందుకు 58 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు పెరగడం, ఇరాన్ సంక్షోభం, హోర్ముజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత్ వంటి దేశాలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఇంధన వాడకాన్ని తగ్గించుకోవడం, బంగారం కొనుగోళ్లను వాయిదా వేయడం, అనవసర విదేశీ ప్రయాణాలు నివారించడం వంటి ఏడు సూత్రాలను ప్రజల ముందుంచారు. దిల్లీ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు 'ఆంక్షలు' కాదని, 'ఆర్థిక దేశభక్తి'ని చాటే 'వివేకవంతమైన వినియోగం' అని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. త్వరలోనే ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని కూడా ప్రారంభించనున్నారు.





# అడ్వకేట్ దుస్తుల్లో కోర్టుకు మమత

**న్యాయవాద హోదాపై బీసీఐ ఆరా .. నివేదిక ఇవ్వాలని బెంగాల్ బార్ కౌన్సిల్‌కు ఆదేశం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ న్యాయవాద హోదాపై భారత బార్ కౌన్సిల్ (బీసీఐ) ఆరా తీస్తోంది. గురువారం ఆమె కలకత్తా హైకోర్టులో న్యాయవాది దుస్తులు ధరించి ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)లో వాదనలు వినిపించడమే ఇందుకు కారణమైంది. ఈ పరిణామంపై స్పందించిన బీసీఐ, ఆమె న్యాయవాద వృత్తికి సంబంధించిన పూర్తి వివరాలను రెండు రోజుల్లోగా అందించాలని పశ్చిమ బెంగాల్ బార్ కౌన్సిల్‌ను ఆదేశించింది. మమతా బెనర్జీ ఎన్‌రోల్‌మెంట్ నంబర్, నమోదు చేసుకున్న తేదీ, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు (2011-2026) ప్రాక్టీస్‌ను నిలిపివేశారా లేదా, తిరిగి ఎప్పుడు పునరుద్ధరించుకున్నారు వంటి వివరాలను సమర్పించాలని బీసీఐ తన లేఖలో కోరింది. రాజ్యాంగబద్ధమైన పదవిలో కొనసాగినందున, ఆమె న్యాయవాద వృత్తి హోదాపై వాస్తవాలను ధ్రువీకరించుకోవాల్సిన అవసరం ఉందని బీసీఐ స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఒరిజినల్ రికార్డులను భద్రపరచాలని, ఎలాంటి మార్పులు చేయరాదని కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో జరిగిన హింసపై దాఖలైన పిల్‌పై విచారణ సందర్భంగా మమత, ప్రధాన న్యాయమూర్తి సుజోయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. తన ట్రేడ్‌మార్క్ తెలుపు చీరపై నల్లకోటు ధరించి కోర్టుకు హాజరైన ఆమె, రాష్ట్రంలో మహిళలు, మైనారిటీలపై దాడులు ఆందోళనకర స్థాయికి చేరాయని ఆరోపించారు. తాను 1995లోనే న్యాయవాదిగా నమోదు చేసుకున్నానని, క్రమం తప్పకుండా సభ్యత్వాన్ని పునరుద్ధరించుకుంటున్నానని ఆమె ధర్మాసనానికి వివరించారు. ఈ పరిణామంపై ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి స్పందిస్తూ.. "నాకు చాలా పనులున్నాయి. అనవసరమైన విషయాల గురించి ఆలోచించడానికి సమయం లేదు" అని వ్యాఖ్యానించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో, భవానీపూర్ నియోజకవర్గంలో సువేందు అధికారి చేతిలో మమతా బెనర్జీ ఓటమి పాలైన విషయం తెలిసిందే.



# బైక్‌పై అసెంబ్లీకి మహారాష్ట్ర సీఎం

**ఇంధన ఆదాపై ప్రధాని పిలుపునకు స్పందన**

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ గురువారం అందరినీ ఆశ్చర్యపరిచారు. ఆయన తన అధికారిక నివాసం నుంచి విధాన్ భవన్‌కు బైక్‌పై ప్రయాణించారు. ఇంధనాన్ని ఆదా చేయాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు, ఫడ్నవీస్ ఈ విధంగా తన వంతు సందేశాన్ని ప్రజలకు ఇచ్చారు. గురువారం జరిగిన శాసనమండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు, ఫడ్నవీస్ బీజేపీ నేత, మంత్రి ఆశీష్ షెలార్‌తో కలిసి బైక్‌పై వెళ్లారు. దాంతో ఫడ్నవీస్ భద్రతా సిబ్బంది కూడా ఆయనను బైక్ లపై అనుసరించారు. ఈ ప్రయాణంలో ఫడ్నవీస్ రాయల్ ఎన్ ఫీల్డ్ క్లాసిక్ 350 (స్టెల్త్ బ్లాక్ కలర్) బైక్ ను ఉపయోగించారు. ఇదే స్ఫూర్తితో మరో మంత్రి నితేష్ రాణే సచివాలయానికి ఏకంగా నడిచి రావడం విశేషం. ఇంధన పొదుపు కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలు కఠిన చర్యలను ప్రకటించింది. ఇందులో భాగంగా మంత్రుల కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను సగానికి తగ్గించాలని నిర్ణయించారు. అంతేకాకుండా మంత్రులు, ప్రభుత్వ అధికారుల విదేశీ పర్యటనలను పూర్తిగా రద్దు చేశారు. ప్రభుత్వ శాఖలకు కేటాయించిన వాహనాలపైనా సమీక్ష జరుపుతామని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ఇంధన సరఫరాపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఇంధనంతో పాటు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేసేందుకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ముడి చమురు, గ్యాస్ దిగుమతుల కోసం భారత్ ఆ ప్రాంతంపైనే ఎక్కువగా ఆధారపడటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పొదుపు చర్యలకు శ్రీకారం చుట్టాయి.



# కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు

న్యూఢిల్లీ: ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టాలని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మను , కోర్టును లక్ష్యంగా చేసుకుని సందేహాలను రేకెత్తిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారనే ఆరోపణలపై అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, మాజీ ఆప్ ఎమ్మెల్యే దుర్గేష్ పాఠక్‌లపై కోర్టు ధిక్కరణ చట్టం కింద క్రిమినల్ చర్యలను ప్రారంభించాలని కోర్టు తమ ఆదేశాల్లో పేర్కొంది. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ముందు తాము హాజరు కాబోమనే విషయాన్ని కేజ్రీవాల్‌తో పాటు పలువురు ఆప్ నాయకులు ఆన్‌లైన్‌లో లేఖలు షేర్ చేశారనే ఆరోపణల నేపథ్యంలో ఈ మేరకు కోర్టు ధిక్కరణ చర్యలకు ఆదేశించారు. దీనిలో భాగంగా జస్టిస్ స్వర్ణ కాంత శర్మ సైతం.. తనను ఎవరూ బెదిరించలేరంటూ గట్టిగా హెచ్చరించారు. 'ఎడిటెడ్ వీడియోలతో నా కుటుంబ సభ్యులను నిందించారు... ఇది నన్ను మాత్రమే కాకుండా న్యాయవ్యవస్థను భయపెట్టడానికే చేశారు. నన్ను ఎవరూ బెదిరించలేరు' అని వ్యాఖ్యానించారు. కాగా, ఎక్సైజ్ పాలసీ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అనూహ్య నిర్ణయాలతో కోర్టు విచారణకు దూరంగా ఉంటున్నారు. ఇప్పటికే పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్, సీనియర్ నేత మనీష్ సిసోడియా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ముందుకు విచారణకు వెళ్లేది లేదని తేల్చిచెప్పారు. దాంతో ఈ కేసులో అనేక ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. తాజా పరిణామంతో ఈ కేసు ఏ మలుపు తీసుకుంటుందో అనే ఆసక్తి నెలకొంది. ఢిల్లీ మద్యం కేసు విచారణ నుంచి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తప్పుకున్నారు. అరవింద్ కేజ్రీవాల్ పై కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టిన నేపథ్యంలో తప్పుకుంటున్నట్లు స్వర్ణకాంత్ శర్మ వెల్లడించారు. న్యాయ క్రమశిక్షణ లో భాగంగా తాను ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఢిల్లీ మద్యం కేసు విచారణ నుంచి తప్పుకోవాలన్న అరవింద్ కేజ్రీవాల్ పిటీషన్ గతంలోనే కొట్టేసిన జస్టిస్ స్వర్ణకాంత్ శర్మ.. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ కేసును మరొక న్యాయమూర్తి కి కేటాయించాలని కోరారు.



# ఎన్డీఆర్ఎఫ్ యూనిఫాం ప్రజలకు ధైర్యం

**కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు**

ఘజియాబాద్: జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్) తన 20 ఏళ్ల సేవలకు గానూ అత్యున్నత గౌరవాన్ని అందుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా ఎన్డీఆర్ఎఫ్ ప్రతిష్ఠాత్మక 'ప్రెసిడెంట్స్ కలర్' పురస్కారాన్ని స్వీకరించింది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. గడిచిన రెండు దశాబ్దాలుగా నిస్వార్థ సేవతో ఎన్డీఆర్ఎఫ్ దేశ ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని చూరగొందని కొనియాడారు. ఈ వేడుకలో భాగంగా అమిత్ షా.. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పరేడ్‌ను సమీక్షించారు. దేశవ్యాప్తంగా విపత్తు ప్రతిస్పందన, సహాయక చర్యలు, మానవతా సేవలో ఆ దళం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. "ప్రెసిడెంట్స్ కలర్ పురస్కారం అందుకోవడం ఏ దళానికైనా గర్వకారణం. ఎన్డీఆర్ఎఫ్ తన 20 ఏళ్ల సేవ, ధైర్యం, పరాక్రమం, అంకితభావంతో ఈ గౌరవానికి సంపూర్ణంగా అర్హత సాధించింది. ఈ 20 ఏళ్ల ప్రస్థానం కేవలం విజయాలు, గుర్తింపులకు మాత్రమే పరిమితం కాలేదు. మీ కర్తవ్య దీక్షతో ఈ పురస్కారానికి మీరు న్యాయం చేశారు" అని అమిత్ షా అన్నారు. "ఎక్కడ విపత్తు జరిగినా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ యూనిఫాంలో అక్కడికి చేరుకోగానే, ప్రజలు ఊపిరి పీల్చుకుంటారు. తమను రక్షిస్తారనే నమ్మకం వారిలో కలుగుతుంది. కేవలం 20 ఏళ్లలోనే ఈ దళం 140 కోట్ల మంది ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంది" అని షా ప్రశంసించారు. ఎన్డీఆర్ఎఫ్ కేవలం మనుషుల ప్రాణాలనే కాకుండా, జంతువులను కూడా రక్షిస్తోందని, ప్రాణ, ఆస్తి నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడం తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణపై హోం మంత్రిత్వ శాఖ విస్తృతంగా పనిచేస్తోందని, వడగాల్పులు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని అమిత్ షా తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 2014 నుంచి విపత్తు నష్టాలను తగ్గించడమే కాకుండా సన్నద్ధత, ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపరిచేందుకు కృషి జరుగుతోందన్నారు. "విపత్తుల్లో మరణాల సంఖ్యను సున్నాకు చేర్చే లక్ష్యం దిశగా మనం ఇప్పుడు అడుగులు వేయగల స్థితిలో ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఏదైనా సైనిక లేదా పారామిలటరీ దళం అందించిన అసాధారణ సేవ, అంకితభావానికి గుర్తింపుగా 'నిషాన్' అని పిలిచే ఈ 'ప్రెసిడెంట్స్ కలర్' అవార్డును ప్రదానం చేస్తారు. ఈ చిహ్నాన్ని అధికారులు తమ యూనిఫాం ఎడమ చేతి స్లీవ్‌పై ధరిస్తారు. భవిష్యత్తులోనూ ఎన్డీఆర్ఎఫ్ మరింత శక్తితో దేశ ప్రజలను అన్ని రకాల విపత్తుల నుంచి రక్షిస్తుందన్న నమ్మకాన్ని అమిత్ షా వ్యక్తం చేశారు.

# అంతా మీ ఇష్టమేనా?

**సీఈసీ నియామకంలో కేంద్ర మంత్రా?**

**హేతుబద్ధతపై సుప్రీం కోర్టు ప్రశ్నలు**

న్యూఢిల్లీ: ఎన్నికల కమిషనర్ల చట్టానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ మరియు ఎన్నికల కమిషనర్ల నియామకానికి ఏర్పాటు చేసిన ఎంపిక కమిటీలో కేంద్ర కేబినెట్ మంత్రిని చేర్చడం వెనుక ఉన్న హేతుబద్ధతను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నియామక ప్రక్రియలో ప్రజాస్వామ్యం ఎక్కడ ఉందని కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రితో కూడిన ప్యానెల్ ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామకంపై నిర్ణయం తీసుకుంటుంది. నియామక ప్రక్రియపై దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా జస్టిస్ దీపాంకర్ దత్తా కీలక ప్రశ్నలు సంధించారు. సీబీఐ డైరెక్టర్ నియామక ప్యానెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉంటున్నారని, ఎన్నికల సంఘం విషయంలో అలా ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. కనీసం స్వతంత్ర సభ్యుడు ఎందుకు ఉండకూడదని అటార్నీ జనరల్‌ను ప్రశ్నించారు. ప్రధానమంత్రి ఒక వ్యక్తిని నియమిస్తే, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు మరొకరిని నియమిస్తారని, అలాంటి సందర్భాలలో కేబినెట్ మంత్రిగా ఉన్నవారు ప్రతిపక్ష నాయకుడికి మద్దతు తెలిపే అవకాశం ఉంటుందా? అని ప్రశ్నించారు. ఆచరణలో అన్ని సందర్భాలలో అలా జరగకపోవచ్చని అటార్నీ జనరల్ సమాధానం ఇచ్చారు. ప్రధాని నిర్ణయాన్ని కేబినెట్ మంత్రి వ్యతిరేకించరని, అప్పుడు ప్రతిపక్ష నాయకుడు ఒక్కరే అవుతారని, దీంతో 2:1తో ప్రధాని సూచించిన వారు నియమించబడతారని జస్టిస్ దీపాంకర్ అన్నారు. ప్రతిపక్ష నాయకుడి పాత్ర కేవలం అలంకారప్రాయమే అని అభిప్రాయపడ్డారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పనిచేస్తున్నట్లు ప్రజలు భావించాలని అన్నారు. ఈ నేపథ్యంలో ఈ చట్టం రాజ్యాంగబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

# కార్లలోనూ డాల్బీ అట్మాస్ సౌండ్

**గూగుల్ లేటెస్ట్ అప్ డేట్ రిలీజ్**

న్యూయార్క్: ప్రముఖ టెక్ దిగ్గజం గూగుల్, తమ ఆండ్రాయిడ్ ఆటో ప్లాట్‌ఫామ్‌లో సరికొత్త ఫీచర్‌ను జోడించింది. వినియోగదారులకు కార్లలో మరింత నాణ్యమైన, స్పష్టమైన ఆడియో అనుభూతిని అందించేందుకు డాల్బీ అట్మాస్ సపోర్ట్‌ను అందుబాటులోకి తెచ్చింది. సపోర్ట్ ఉన్న యాప్‌లు, కార్లలో ఈ ఫీచర్ లభించనుంది. తొలి దశలో బీఎండబ్ల్యూ, మహీంద్రా, మెర్సిడెస్-బెంజ్, రెనో, స్కోడా, టాటా, వోల్వో వంటి కార్లలో ఈ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఆడియోతో పాటు వీడియో నాణ్యతపై కూడా గూగుల్ దృష్టి సారించింది. ఆండ్రాయిడ్ ఆటోలో తొలిసారిగా ఫుల్ హెచ్‌డీ (1080పి) 60ఎఫ్‌పీఎస్ వీడియో స్ట్రీమింగ్‌కు సపోర్ట్ ప్రకటించింది. దీంతో పాటు ఆండ్రాయిడ్ ఆటో యూజర్ ఇంటర్‌ఫేస్‌ను కూడా 'మెటీరియల్ 3 ఎక్స్‌ప్రెసివ్' డిజైన్‌తో పూర్తిగా మార్చింది. దీనివల్ల కొత్త ఫాంట్లు, ఆకర్షణీయమైన యానిమేషన్లు, వాల్‌పేపర్లు లభిస్తాయి. అంతేకాదు, గత పదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా గూగుల్ మ్యాప్స్‌కు అతిపెద్ద అప్‌డేట్ వచ్చింది. 'ఇమ్మర్సివ్ నావిగేషన్' పేరుతో 3డీలో భవనాలు, ఓవర్‌పాస్‌లు, రోడ్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ వంటి వివరాలను ఇది స్పష్టంగా చూపిస్తుంది. అలాగే, ఫోన్‌లోని జెమినీ ఏఐ ఫీచర్లను నేరుగా కార్ ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్‌పై ఉపయోగించుకునే సౌకర్యం కూడా కల్పించారు. గూగుల్ బిల్ట్-ఇన్ ఉన్న కార్లలో జూమ్ వంటి మీటింగ్ యాప్‌లకు కూడా సపోర్ట్ లభించనుంది. ఈ కొత్త ఫీచర్లన్నీ సపోర్ట్ చేసే కార్లలో త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

# రెండో రోజూ మార్కెట్ల జోరు

ముంబై: భారత స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ లాభాలను నమోదు చేశాయి. గురువారం ట్రేడింగ్‌లో ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్, బ్యాంకింగ్ రంగాల షేర్లలో బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు 1 శాతానికి పైగా లాభపడ్డాయి. కరెన్సీ అస్థిరతను నియంత్రించేందుకు ప్రభుత్వం విధానపరమైన చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను బలపరిచాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 789.74 పాయింట్లు (1.06%) పెరిగి 75,398.72 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 277 పాయింట్లు (1.18%) లాభపడి 23,689.60 వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒక దశలో సెన్సెక్స్ 1,073 పాయింట్ల వరకు లాభపడగా, నిఫ్టీ 364 పాయింట్ల మేర పెరిగింది. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ ఫార్మా ఇండెక్స్ 2.74 శాతం, నిఫ్టీ హెల్త్‌కేర్ 2.56 శాతంతో టాప్ గెయినర్లుగా నిలిచాయి. మెటల్, పీఎస్‌యూ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ సూచీలు కూడా లాభపడ్డాయి. అయితే, టెక్నాలజీ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ 2 శాతం నష్టపోయింది. హెచ్‌సీఎల్ టెక్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి ప్రధాన ఐటీ కంపెనీల షేర్లు నష్టాలను చవిచూశాయి. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు బాండ్లపై పన్నుల విధానాన్ని సులభతరం చేయడం వంటి చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందన్న వార్తలతో మార్కెట్లు పుంజుకున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో, ట్రంప్-షీ సమావేశం తర్వాత మెరుగైన అంతర్జాతీయ ఆర్థిక సహకారంపై ఆశలు కూడా సానుకూల ప్రభావం చూపాయి.

# జియో ప్లాట్‌ఫామ్స్ ఎండీగా ఆకాశ్ అంబానీ

ముంబై: జియో ప్లాట్‌ఫామ్స్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆకాశ్ అంబానీ నియమితులయ్యారు. రిలయన్స్‌కు చెందిన ఈ డిజిటల్ సేవల సంస్థ ఐపీవోకు వెళ్ళనుంది. ఈ నేపథ్యంలో ఆకాశ్ అంబానీని మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఏప్రిల్ 9వ తేదీ నుంచి ఈ నియామకం అందుబాటులోకి వచ్చినట్లు కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. ఐదేళ్ల కాలం పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని మే 7వ తేదీన సమర్పించిన ఫైలింగ్ లో పేర్కొంది. జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు సన్నద్ధమవుతున్న వేళ ఈ నియామకం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ ఏడాది మే నెలాఖరున లేదా జూన్ నెలలో ఐపీవోకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించే అవకాశం ఉంది. టెలికం విభాగమైన రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ బోర్డులో 2014 అక్టోబర్ నుంచి ఆకాశ్ అంబానీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. 2022 జూన్ నెలలో ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆకాశ్ అంబానీ నేతృత్వంలో జియో 2016లోనే కేవలం ఆరు నెలల వ్యవధిలో 10 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లను సొంతం చేసుకుంది. 2026 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.30 వేల కోట్ల నికర లాభాన్ని రూ.1.46 లక్షల కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

# ప్రభుత్వ ఉద్యోగుల డీఏ 60 శాతానికి!

చెన్నై: తమిళనాడులోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ముఖ్యమంత్రి విజయ్ ప్రభుత్వం గురువారం శుభవార్త అందించింది. వారి కరవు భత్యాన్ని (డీఏ) 2 శాతం పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. దీంతో డీఏ 58 శాతం నుంచి 60 శాతానికి పెరిగింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 16 లక్షల మందికి ప్రయోజనం చేకూరనుంది. కేంద్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు డీఏను 58 శాతం నుంచి 60 శాతానికి పెంచిన నేపథ్యంలో, అదే ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా వర్తింపజేస్తున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ఈ పెంపు 2026 జనవరి 1 నుంచే వర్తిస్తుందని స్పష్టం చేసింది. ఈ డీఏ పెంపు వల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా సుమారు రూ.1,230 కోట్ల అదనపు భారం పడనుందని అధికారులు అంచనా వేశారు. అయినప్పటికీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ప్రజా సంక్షేమ పథకాల అమలులో ఉద్యోగుల పాత్ర కీలకమని ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ సందర్భంగా గుర్తు చేసింది.

# సంజయ్‌వి స్వార్థ రాజకీయాలు

## విద్యార్థులకు సీబీఎస్సీ విద్యను దూరం చేసే కుట్ర.. ఎంపీ అరవింద్‌పై అనవసరపు విమర్శలు

**జగిత్యాల బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ భోగ శ్రావణి**

జగిత్యాల, మే 14 (ఈవార్తలు) : ఇప్పటికైనా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్వార్థ రాజకీయాలు చేయడం మానుకోవాలని జగిత్యాల నియోజకవర్గ బీజేపీ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి అన్నారు. 'పొంతన లేకుండా మాట్లాడడం ఎమ్మెల్యే సంజయ్ కే చెందుతుంది.. సీబీఎస్సీ విద్యను విద్యార్థులకు దూరం చేసే కుట్ర జరుగుతోంది.. ఎంపీ అరవింద్ పై అనవసరపు విమర్శలు చేస్తే ఊరుకోం.. దమ్ముంటే పది ఎకరాల స్థలం వెంటనే కేటాయించాలి' అని మండిపడ్డారు. గత రెండు రోజుల క్రితం ఓ సమావేశంలో డాక్టర్ సంజయ్ కేంద్ర విద్యాలయాల ఏర్పాటుపై చేసిన వ్యాఖ్యలకు ఆమె కౌంటర్ ఇచ్చారు. తాము నిజాలు చెప్పినప్పటికీ జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పొంతన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. తాము దీక్ష చేస్తున్న విషయం గురించి మాట్లాడితే అది పక్కనపెట్టి తమను ఉద్దేశపూర్వకంగానే వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. గుమ్మడికాయల దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు తాము వాస్తవాలు మాట్లాడితే అది పక్కనపెట్టి పొంతన లేకుండా మాట్లాడడం ఎమ్మెల్యే సంజయ్ కే చెందుతుందన్నారు. జగిత్యాలలో ఉన్న అటూ ఇటూ కానీ నాయకులు సైతం తాము చెప్పిన నిజాన్ని ఒప్పుకోవడం లేదని విమర్శించారు. వారి యొక్క స్వార్థ రాజకీయాల కోసమే, వారు భూములు, జాగలు మరింత పెంచుకోవడానికే దాదాపు ఒకటిన్నర సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు స్థలం కేటాయించకుండా అడ్డుకుంటున్నారన్నారు. కేవలం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న విద్యా సంస్థలకు మాత్రమే స్థలాలు ఇస్తామని, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసే విద్యాసంస్థలకు స్థలం లేదని సాక్షాత్తు ఎమ్మెల్యే అనడం హాస్యస్పదంగా ఉందన్నారు. ప్రజలు నమ్మి ఓటేసినప్పుడు వారి కనీస అవసరాలు తీర్చే బాధ్యత ఎమ్మెల్యే పైన ఉంటుందని, దాన్ని గుర్తుంచుకొని నడుచుకోవాలని హితవు పలికారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ కేంద్రాన్ని ఒప్పించి ఇక్కడ కేంద్ర విద్యాలయం ఏర్పాటు చేయడానికి మంజూరు తీసుకువస్తే అదేమి ఇక్కడ విద్యార్థులకు అవసరం లేనట్టు ఎమ్మెల్యే ప్రవర్తించడం సరికాదన్నారు. సీబీఎస్సీ విద్యను ఇక్కడ విద్యార్థులకు దూరం చేసే కుట్రను స్థానిక ఎమ్మెల్యే పన్నుతున్నట్లు తమకు అనుమానం ఉందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందాలని తమ తాపత్రయ పడుతుంటే దీని అడ్డుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తుండడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు 25 ఎకరాల అయినా సరే కేటాయించిన ఎమ్మెల్యే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పాఠశాలకు మాత్రం 10 ఎకరాల స్థలం కేటాయించలేకపోతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రాజకీయాలకు రాకముందు రాజకీయాలకు వచ్చిన తర్వాత తన ఆస్తులు వివరాలేంటో చూసుకుందామని సవాల్ విసిరారు. తాము విద్యార్థుల భవిష్యత్తు కోసం మాట్లాడుతుంటే దాన్ని తప్పు దోవ పట్టించడానికి ఎమ్మెల్యే డాక్టర్



సంజయ్ ఆస్తుల విషయాన్ని తెరపై తెచ్చారని విమర్శించారు. డబ్బు పిచ్చితోనే తమ ఎంపీ ధర్మపురి అరవింద్ పైన, ఇతర సీనియర్ నాయకులపై అనవసరపు విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే సంజయ్ చిట్ట మొత్తం తమ వద్ద ఉందని, అది విప్పితే నియోజకవర్గంలో తలెత్తుకొని ఉండలేరని వివరించారు. చిట్టా విప్పాల అని సవాల్ విసిరారు. పదేళ్లుగా బీజేపీ పార్టీలో ఉన్న నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పై ఒక్క అవినీతి మచ్చా అయినా ఉందా అని, ఉంటే రుజువు చేయాలని ఎమ్మెల్యే సంజయ్ కు తెలిపారు. ఎప్పుడూ కాంట్రాక్టర్ల వద్ద కమిషన్ల కొరకు కక్కుర్తి పడే ఆయన తమ ఎంపీపై మాట్లాడే అర్హత లేదన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు మంజూరు చేసిందో, ఎన్ని చేస్తుందో ఎమ్మెల్యే సంజయ్ గుర్తించాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల నుండి అభివృద్ధి పనులు ప్రారంభించే సమయంలో ప్రోటోకాల్ ప్రకారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ను పిలవాల్సి ఉన్నప్పటికీ ఆయనను పిలవకుండానే పనులను ప్రారంభించడం ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. సమావేశంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, అర్బన్ మండల అధ్యక్షులు రామ్ రెడ్డి, మహిళ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పిండేరు భానుప్రియ, జిల్లా మహిళా మోర్చా నాయకురాలు దూరిశెట్టి మమత, ప్రధాన కార్యదర్శులు ఆముదరాజు, సిరికొండ రాజన్న, పూదరి శ్రీనివాస్, జిల్లా కార్యాలయ కార్యదర్శి జంబర్తి దివాకర్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ సుంచు సురేష్, సిరిపురం శ్రీనివాస్, పవన్ సింగ్, గదాసు రాజేందర్, ఇట్యాల రాము, మహిళా మోర్చా నాయకురాలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని వ్యక్తి స్పాట్ డెడ్

ధర్మపురి, మే 14 (ఈవార్తలు): ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన ఎరవెల్లి పరశురాం (43) తన కారును చర్లపల్లి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు పక్కన నిలిపి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర రక్తగాయాలు కావడంతో ఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం ఆయన భార్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత నాలుగు నెలలుగా కరీంనగర్‌లో ఉంటూ సోడా బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నట్లు సమాచారం. మృతుడి తల్లి ఎరవెల్లి లింగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు వెల్గటూరు ఎస్ఐ పి.ఉదయ్‌కుమార్ తెలిపారు.

## ట్రాక్టర్-కారు ఢీ.. ఒకరు మృతి

ధర్మపురి, మే 14 (ఈవార్తలు): ధర్మపురి మండలం రాయపట్నం శివారులో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన కొందరు యువకులు హాజీపూర్‌కు పెళ్లికి వెళు ుండగా, వారు ప్రయాణిస్తున్న స్విఫ్ట్ డిజైర్ కారు హనుమాన్ విగ్రహం సమీపంలో అదుపుతప్పి రోడ్డుపక్కన నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. అనంతరం యాక్టివా స్కూటీ, హోండా షైన్ బైక్‌లను కూడా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తరాళ్ళ రాయమల్లు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 అంబులెన్స్ ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోడి ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మపురి ఎస్సై జి. మహేష్ తెలిపారు.



## 3.14 కోట్లతో మోతె చెరువు అభివృద్ధి

**శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సంజయ్**

జగిత్యాల, మే 14 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 4వ వార్డులో రూ.3 కోట్ల 14 లక్షల వ్యయంతో చేపట్టనున్న మోతే చెరువు అభివృద్ధి పనులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 50 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, జగిత్యాలలో ముప్పరపు చెరువు, మోతే చెరువులకు ప్రత్యేక నిధులు కేటాయించినట్లు తెలిపారు. చెరువుల పరిరక్షణలో ప్రజలు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు లే అవుట్‌ల ప్రకారం మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని, బఫర్‌జోన్‌లలో ఎలాంటి నిర్మాణాలు చేయవద్దని హెచ్చరించారు. జగిత్యాలకు మరో 'హైడ్రా' పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం ముప్పరపు చెరువు పూర్తిగా కలుషితమైందని, ఇది అందరికీ కనువిప్పు కావాలని పేర్కొన్నారు. చెరువులు కలుషితం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను ప్రత్యేకంగా నిర్మిస్తామని, చెరువు సుందరీకరణ, కంచె ఏర్పాటుకు నిధులు వినియోగిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జగిత్యాలలో 4,500 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించామని, 230 కోట్లతో నిర్మిస్తున్న ఆసుపత్రి ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని చెప్పారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి ముఖ్యమంత్రి మంజూరు చేసిన 62 కోట్లతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజంగి నందయ్య, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## మక్కల కొనుగోలులో కేంద్రం విఫలం

**తెలంగాణ రైతులు నష్టపోతున్నారు.. ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్**



రాయికల్, మే 14 (ఈవార్తలు): మొక్కజొన్న కొనుగోలులో కేంద్ర ప్రభుత్వ అసమర్థ వైఖరి వల్ల తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆరోపించారు. రాయికల్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటిస్తున్నప్పటికీ కొనుగోళ్ల విషయంలో రైతులకు సహకారం అందించడం లేదన్నారు. ప్రతి క్వింటాల్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.వెయ్యి వరకు నష్టం భరిస్తోందని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో రైతుల కోసం ప్రభుత్వం రూ.12 నుంచి రూ.15 కోట్ల వరకు భారం మోస్తోందన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మొక్కజొన్న కొనుగోళ్లు భారీగా పెరిగాయని ఎమ్మెల్యే వివరించారు. రాయికల్, జగిత్యాల, లక్ష్మీపూర్ ప్రాంతాల్లో వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా కేంద్రం మొక్కజొన్న కొనుగోలు చేయడం లేదని విమర్శించారు. చలిగల్‌లో కేంద్రీయ విద్యాలయం, ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్థల సమస్యపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని పలుమార్లు కలిసి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. జిల్లా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కూడా పూర్తి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. ఎంపీ ధర్మపురి అరవింద్ తనను కావాలనే దోషిగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. జగిత్యాల అభివృద్ధిని రాజకీయాలతో ముడిపెట్టవద్దని, విద్యార్థుల చదువులతో రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాలు తగవని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు.

## అబ్బాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీనామా



గొల్లపల్లి, మే 14 (ఈవార్తలు): గొల్లపల్లి మండలం అబ్బాపూర్ గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు జక్కుల ధనంజయ్ కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పనితీరు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా వడ్ల కొనుగోలు కేంద్రాల్లో సరైన విధంగా కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయినా, సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో రైతులకు పూర్తి భరోసా ఉండేదని, ఇలాంటి సమస్యలు ఎదురుకాలేదని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరి ప్రజల కోసం పనిచేస్తానని ధనంజయ్ వెల్లడించారు.




# చదువుల తల్లి వర్షిణి

## 440 మార్కులకు 437

**గంగాధర గురుకుల విద్యార్థిని ఘనత**

**హైదరాబాద్‌లో ప్రతిభా పురస్కారం అందజేత**

హైదరాబాద్/గంగాధర/జగిత్యాల బ్యూరో, మే 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మోరపల్లికిచెందిన చిలుక వర్షిణి అనే విద్యార్థిని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మన్ననలు అందుకుంది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలో బైపీసీ చదువుతున్న వర్షిణి.. 440 మార్కులకు 437 సాధించింది. గురువారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కొమురంభీం భవన్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీసీ గురుకులాలు సంక్షేమ హాస్టల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వర్షిణికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. ' పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బీసీ గురుకుల హాస్టల్ విద్యార్థులను "ప్రతిభా పురస్కారాలు" అందుకుంటున్న వారందరికీ శుభాకాంక్షలు. అత్యుత్తమ మార్కులు సాధించిన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు. ఈ విజయం మీ తల్లిదండ్రులకు, గురువులకు, విద్యాసంస్థలకు గర్వకారణం. గ్రామీణ, పేద, వెనుకబడిన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ కృషి, పట్టుదలతో అద్భుత ఫలితాలు సాధించడం సమాజానికి స్ఫూర్తిదాయకం. 2025-26 విద్యా సంవత్సరానికి గాను మొత్తం 508 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను ఈరోజు సన్మానించడం జరుగుతోంది. ఇది సాధారణ విషయం కాదు.. ఇది బీసీ సంక్షేమ విద్యా వ్యవస్థ సాధించిన గొప్ప విజయం. భవిష్యత్తులో ఇంకా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం బీసీ విద్యార్థుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది' అని వెల్లడించారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు , బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ , బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ బాలమయాదేవి ,డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్ రావు , ఎంజేపి సెక్రటరీ సైదులు, బీసీ కమిషన్ సభ్యులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# మామిడి కిలో రూ.5

**కుప్పకూలిన ధరలు.. రైతులకు తీరని నష్టం**

**నకిలీ మందులు, నాణ్యత సమస్యలతో దెబ్బ**

**ఫర్టిలైజర్ షాపుల నిర్లక్ష్యమే కారణం?**





జగిత్యాల బ్యూరో, మే 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మామిడి రైతులకు ఈ ఏడాది తీవ్ర నిరాశ ఎదురైంది. పండ్లపై మచ్చలు, నాణ్యత సమస్యలు, మార్కెట్లో డిమాండ్ తగ్గడంతో ధరలు పూర్తిగా కుప్పకూలాయి. ప్రతి సంవత్సరం మంచి ధరలు పలికే మామిడి ఈసారి కనీస ధర కూడా దక్కక రైతులు ఆవేదన చెందుతున్నారు. రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ మ్యాంగో మార్కెట్ అధ్యక్షుడు అమీన్ ఉద్దీన్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ సంవత్సరం సుమారు 18 వేల నుంచి 22 వేల ఎకరాల్లో మామిడి సాగు పండింది అని తెలిపారు. బంగినపల్లి, దసేరి, హిమాయత్, మల్లికా, తోతాపురి రకాల మామిడి పండ్లు ఎక్కువగా సాగు చేస్తారని చెప్పారు. గత సంవత్సరాల్లో కిలో మామిడి రూ.20 నుంచి రూ.45, రూ.55, కొన్ని రకాలైతే రూ.60 వరకు అమ్ముడయ్యేదని తెలిపారు. అయితే ఈసారి పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారిందన్నారు. ప్రస్తుతం కిలో మామిడి రూ.5 నుంచి గరిష్ఠంగా రూ.20 వరకు మాత్రమే విక్రయమవుతోందని పేర్కొన్నారు. పండ్లపై మచ్చలు రావడం, నాణ్యత దెబ్బతినడం వల్ల ఇతర రాష్ట్రాలతో పాటు విదేశీ మార్కెట్ల నుంచి కూడా డిమాండ్ తగ్గిందన్నారు. సాధారణంగా ప్రతి ఏడాది విదేశాలకు పెద్ద ఎత్తున ఎగుమతులు జరిగేవని, ఈసారి మాత్రం సరఫరా దాదాపు నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ షాపుల నిర్లక్ష్యమే రైతుల నష్టాలకు ప్రధాన కారణమని ఆరోపించారు. కొంతమంది ఎరువుల, పురుగుమందుల దుకాణదారులు నకిలీ మందులు విక్రయించడం వల్లే మామిడి తోటలు దెబ్బతిన్నాయని చెప్పారు. రైతులు నమ్మి కొనుగోలు చేసిన మందుల వల్ల పండ్లపై మచ్చలు ఏర్పడి నాణ్యత పూర్తిగా దెబ్బతిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా సరైన పర్యవేక్షణ చేయలేదని రైతులు విమర్శిస్తున్నారు. నకిలీ మందుల విక్రయాలపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దర్యాప్తు చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే నష్టపోయిన మామిడి రైతులకు ప్రత్యేక పరిహారం ప్రకటించాలని కోరుతున్నారు. మ్యాంగో మార్కెట్ అధ్యక్షుడు మొయినుద్దీన్ మాట్లాడుతూ.. మార్కెట్‌లో వేలంపాట విధానం ద్వారా రైతులకు కొంతమేర లాభం చేకూరే అవకాశం ఉందన్నారు. జిల్లాలో మామిడి పండ్ల నాణ్యత దెబ్బతినడం, విదేశీ ఎగుమతులు తగ్గిపోవడంతో ధరలు కుప్పకూలాయని పేర్కొన్నారు. గతంలో రూ.40 నుంచి రూ.60 వరకు పలికిన మామిడి ఈసారి రూ.5 నుంచి రూ.20 మధ్యే అమ్ముడవుతోందన్నారు. అయితే మార్కెట్‌లో పారదర్శకంగా వేలంపాట నిర్వహించడం వల్ల వ్యాపారుల మధ్య పోటీ పెరిగి రైతులకు కొంత మెరుగైన ధర లభించే అవకాశముందని మొయినుద్దీన్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం కూడా రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

## స్నేహితురాలి పుట్టినరోజున రక్తదానం



జగిత్యాల, మే 14 (ఈవార్తలు): స్నేహితురాలి పుట్టినరోజును ప్రత్యేకంగా గుర్తుండేలా చేసేందుకు జగిత్యాల రిపోర్టర్ సాయికుమార్ వినూత్నంగా రక్తదానం చేశారు. 18 సంవత్సరాల స్నేహబంధానికి గుర్తుగా జగిత్యాల సివిల్ ఆసుపత్రిలో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. కేక్ కట్ చేయడం కంటే రక్తదానం చేసి ప్రాణాలను కాపాడటం గొప్ప బహుమతిగా భావిస్తున్నానని సాయికుమార్ తెలిపారు. "పుట్టినరోజులు ఆనందంగా జరుపుకోవడం సాధారణమే. అయితే రక్తదానం ద్వారా పలువురికి ప్రాణదాతలమవ్వడం నిజమైన మానవత్వం. నా స్నేహితురాలి పుట్టినరోజు ఎప్పటికీ గుర్తుండేలా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. సాయికుమార్ చేసిన ఈ సేవా కార్యక్రమాన్ని ఆసుపత్రి సిబ్బంది, స్నేహితులు అభినందించారు. యువత సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

## ఇంకెప్పుడు ధాన్యం కొనేది?

**40 శాతం కూడా తూకం కాలేదేంటి?.. ధాన్యం కొనుగోళ్లపై జీవన్ రెడ్డి ఫైర్**



రాయికల్, మే 14 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లింగాపూర్, చింతలూర్, కొత్తపేట్, మూటపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, వడ్ల కొనుగోలు కేంద్రాలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తూకం ప్రక్రియ కూడా సక్రమంగా జరగడం లేదని, లారీలు అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులను ప్రశ్నించారు. ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ఇప్పటివరకు 40 శాతం ధాన్యం కూడా తూకం కాలేదని తెలుసుకున్నారు. లారీలు తక్కువగా ఉండటంతో పాటు అమాలి కార్మికుల సమస్య కూడా ఉందని, తూకాలు లేకపోవడంతో వారికి పనిలేక కేంద్రాల వద్ద ఉండటం లేదని ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే లారీలు పంపించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చినట్లు జీవన్‌రెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరగాలి


**అదనపు కలెక్టర్ రాజగౌడ్ ఆదేశాలు**



జగిత్యాల, మే 14 (ఈవార్తలు): జగిత్యాల, జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు, రవాణా, అన్‌లోడింగ్ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజగౌడ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కోరుట్ల మండలంలోని జోగిన్‌పల్లి గ్రామంలో ఉన్న మూడు రైస్‌మిల్లులను ఆయన పరిశీలించారు. మిల్లుల్లో జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పరిశీలించి, కొన్ని వాహనాలు వేచివున్నట్లు గుర్తించారు. మిల్లులకు చేరుకున్న ప్రతి వాహనాన్ని 15 నుంచి 18 గంటల వ్యవధిలో అన్‌లోడ్ చేస్తున్నట్లు మిల్లర్లు, అధికారులు వివరించారు. ధాన్యం రవాణా, అన్‌లోడింగ్‌లో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మిల్లర్లకు సూచించారు. రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అనంతరం మాధాపూర్ ఐకేపీ పీపీసీ కేంద్రం, పైడిమడుగు ప్యాక్స్ పీపీసీ కేంద్రాలను సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. తర్వాత జోగిన్‌పల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగకరమని, మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, డీటీ, ఏపీఎం, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లవ్లీ చిత్రం


అనికా శర్మ




## వస్తోంది.. 3 ఇడియట్స్2!

భారతీయ సినీ చరిత్రలో కల్ట్ క్లాసిక్‌గా నిలిచిపోయిన బాలీవుడ్ చిత్రం '3 ఇడియట్స్' సీక్వెల్‌పై ఎప్పటినుంచో నడుస్తున్న ఊహాగానాలకు తెరపడింది. ఈ సినిమా సీక్వెల్ పనులను బాలీవుడ్ మిస్టర్ పర్‌ఫెక్షనిస్ట్ ఆమిర్ ఖాన్ అధికారికంగా ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ ప్రీ–ప్రొడక్షన్ దశలో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ సీక్వెల్‌లో కూడా ఒరిజినల్ త్రయం ఆమిర్ ఖాన్, ఆర్. మాధవన్, శర్మన్ జోషి తమ పాత్రలను తిరిగి పోషించనుండటం విశేషం. ఫిల్మ్ ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సీక్వెల్ కథలో ఒక భారీ టైమ్ లీప్ ఉండనుంది. అంటే, 2009 నాటి సినిమాలో కనిపించిన పాత్రల జీవితంలోని మరో దశను ఇందులో చూపించబోతున్నారు. అయితే, ఈ కథలో అతిపెద్ద ట్విస్ట్ ఏంటంటే.. ఈ కథ మొదటి భాగం తర్వాత కొనసాగుతుందా లేక దానికంటే ముందు జరిగిన కథా (ప్రీక్వెల్) అనేది ఇంకా సస్పెన్స్‌గానే ఉంది. ఈ కథాంశం గురించిన పూర్తి వివరాలు ప్రస్తుతం ఆమిర్ ఖాన్‌కు మాత్రమే తెలుసని చెబుతున్నారు. 2009లో రాజ్‌కుమార్ హిరాణీ దర్శకత్వంలో వచ్చిన '3 ఇడియట్స్' ప్రపంచవ్యాప్తంగా భారీ విజయం సాధించి, రూ.400 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. ఆమిర్ ఖాన్ పోషించిన 'రాంచో' పాత్ర ఇండియన్ సినిమాలో ఐకానిక్‌గా నిలిచిపోయింది. ఈ చిత్రంలో కరీనా కపూర్ ఖాన్, బోమన్ ఇరానీ, మోనా సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు సీక్వెల్‌కు కూడా రాజ్‌కుమార్ హిరాణీనే దర్శకత్వం వహించే అవకాశాలున్నాయని వార్తలు వస్తున్నాయి.

## కాంచన4తో లారెన్స్ భారీ ప్లాన్

దక్షిణాదిలో హారర్ కామెడీకి కమర్షియల్ మార్కెట్ తెచ్చిన డైరెక్టర్, నటుడు రాఘవ లారెన్స్ పేరు ఇప్పటికీ ప్రత్యేకంగానే వినిపిస్తుంది. మునితో మొదలైన ఈ ప్రయాణం కాంచన, గంగ, కాంచన3 వరకు వచ్చేసరికి ఒక బ్రాండ్‌గా మారిపోయింది. ముఖ్యంగా కాంచన3 కథ పరంగా విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ బాక్సాఫీస్ వద్ద వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ఈ ఫ్రాంచైజ్‌కు ఉన్న మాస్ రీచ్‌ను నిరూపించింది. ఇప్పుడు అదే సిరీస్‌లో తెరకెక్కుతున్న కాంచన4పై కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్ ట్రేడ్ వర్గాల్లోనూ భారీ చర్చ నడుస్తోంది. ఈసారి కేవలం మరో సీక్వెల్‌గా కాకుండా, హారర్ కామెడీ జానర్‌కు మళ్లీ గోల్డెన్ డేస్ తీసుకొచ్చే సినిమాగా దీన్ని తీర్చిదిద్దాలని లారెన్స్ పట్టుదలతో పనిచేస్తున్నట్టు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి బయటకు వస్తున్న వివరాలు చూస్తే కాంచన 4 సాధారణ స్థాయి సినిమా కాదనే విషయం స్పష్టమవుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ సినిమాలో కొన్ని కీలక ఎపిసోడ్స్ ఆశించిన స్థాయిలో రాకపోవడంతో లారెన్స్ రీషూట్స్ చేస్తున్నారని తెలుస్తోంది. సాధారణంగా హారర్ కామెడీ సినిమాల్లో వేగంగా షూటింగ్ పూర్తి చేసే ట్రెండ్ ఉన్నప్పటికీ, ఈసారి మాత్రం క్వాలిటీ విషయంలో రాజీ పడకూడదనే నిర్ణయంతో పనిచేస్తున్నారని చెన్నై సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఏడాదిన్నరగా షూటింగ్ జరుగుతుండగా, మొత్తం సినిమా పూర్తవడానికి మరో నాలుగైదు నెలలు పడొచ్చని అంచనా.




## లోకజ్ఞానం పెంచుకున్నా: నిత్యా



తన కెరీర్ ప్రారంభంలో ఒక హీరో గురించి అడిగిన ప్రశ్న, ఆ తర్వాత తనను ఇబ్బంది పెట్టిందని, దీంతో తాను లౌక్యంగా మాట్లాడడం నేర్చుకున్నానని ప్రముఖ సినీ నటి నిత్యామీనన్ అన్నారు. ఆమె కెరీర్ ప్రారంభంలో ఒక జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, "ప్రభాస్ ఎవరు?" అని రిప్లయ్ ఇవ్వడం అప్పట్లో చర్చకు దారి తీసింది. ఈ అంశంపై ఇటీవలి ఇంటర్వ్యూలో ఆమె స్పందించారు. ఆ సమయంలో తాను చాలా అమాయకంగా ఉండేదానని, ఒక్క మాటను పట్టుకుని రాద్ధాంతం చేయడం తనను చాలా ఇబ్బందికి గురిచేసిందని అన్నారు. తన నిజాయతీని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొంతమంది ఈ విషయాన్ని పెద్దది చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘటన తర్వాత అందరి దగ్గర నిజాయతీగా ఉండడం పనికిరాదన్న విషయం అర్థమైందని వెల్లడించారు. కొన్నిసార్లు తెలివిగా మాట్లాడటం అవసరమని తాను తెలుసుకున్నానని అన్నారు. ప్రతి ఒక్కరు తన నిజాయతీకి అర్హులు కారని అర్థమైందని ఆమె పేర్కొన్నారు. ఆ తర్వాత తాను లోకజ్ఞానాన్ని పెంచుకున్నానని అన్నారు. నాడు ప్రభాస్ అంశం కారణంగా తాను ఎంతో ఇబ్బందిపడ్డానని వాపోయారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు సినిమాలకు దూరంగా ఉండి, తనను తాను తెలుసుకోవడానికి ప్రయత్నించానని తెలిపారు. ఆ సమయంలో కొన్ని ఫేక్ ఫొటోలు సృష్టించి తనను మానసికంగా కృంగదీసే ప్రయత్నం చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు తనకు జీవితంలో ఎంతో నేర్పాయని, అప్పటి నుంచి తాను మనుషులను అంచనా వేయడంలో చాలా మారిపోయానని వెల్లడించారు.



## రష్మికకు అక్రోఫోబియా

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా నటనతోనే కాదు. తన వ్యక్తిత్వంతోనూ ఎంతోమంది అభిమానులను సంపాదిం చుకుంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ నెటిజన్లను ఆకర్షించడంలోనూ కన్నడ కస్తూరి ముందుం టుంది. తాజాగా రష్మిక జీవితంలో ఓ బలహీనతను ఎలా అధిగమించిందో? రివీల్ చేసింది. షూటింగ్ నిమిత్తం కొచ్చిలో ఉన్న సమయంలో ఎంతో కాలంగా ఉన్న ఎత్తు భయాన్ని ఆమె ధైర్యంగా ఎదుర్కొంది. సాధారణంగా రష్మిక ఎంతో ఉత్సాహంగా? సాహసోపేతంగా కనిపిస్తుంది. కానీ అమ్మడికి అక్రోఫోబియా (ఎత్తును చూస్తే కలిగే భయం) ఉందని చాలామందికి తెలియదు. కొచ్చిలో ఓ హోటల్‌లో బస చేసినప్పుడు అక్కడి ఎత్తైన ప్రదేశం నుండి ప్రకృతిని వీక్షించే అవకాశం వచ్చినప్పుడు మొదట ఎంతో భయపడిందట. అయితే ఆ భయాన్ని అలాగే ఉంచుకోకూడదని నిర్ణయించుకుని తనను తాను సవాలు చేసుకున్నట్లు రష్మిక పేర్కొంది. ఆ ఎత్తైన ప్రదేశం నుంచి కిందకు చూడటం మొదట్లో ఎంతో కష్టమైందని గుండె వేగంగా కొట్టుకుందని వివరించింది. -మనం దేని గురించి అయితే భయపడతామో? దాన్ని నేరుగా ఎదుర్కొన్నప్పుడే ఆ భయం పోతుంది- అనే సూత్రాన్ని ఆమె ఈ సందర్భంగా పాటించింది. మెల్లగా ఆ ఎత్తుకు అలవాటు పడి ప్రకృతి అందాలను ఆస్వాదించడం మొదలుపెట్టాక తనలో తెలియని విజయం కలిగినట్లు చెప్పుకొచ్చింది.

## ఎన్నెన్నో పాఠాలు: భాగ్యశ్రీ భోర్సే

మరాఠీ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నాల్లో బిజీగా ఉంది. మిస్టర్ బచ్చన్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ యంగ్ హీరోయిన్‌కు తొలి సినిమా ఆశించిన విజయాన్ని అందించకపోయినా, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామర్, డ్యాన్స్‌లకు మంచి స్పందన లభించింది. ఆ సినిమా తర్వాత వరుసగా పలు క్రేజీ ప్రాజెక్ట్‌లలో అవకాశాలు దక్కించుకున్న భాగ్యశ్రీ, యంగ్ హీరోలతో పాటు స్టార్ నటుల సరసన నటిస్తూ టాలీవుడ్‌లో తన స్థానం బలపరచుకునే ప్రయత్నం చేస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో ఉన్న సినిమాలు కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. మిస్టర్ బచ్చన్ తర్వాత భాగ్యశ్రీ విజయ్ దేవరకొండతో కింగ్‌డమ్, రామ్ పోతినేనితో ఆంధ్ర కింగ్ తాలూకా, అలాగే దుల్కర్ సల్మాన్‌తో చేసిన కాంత సినిమాలు ఆమెకు నటిగా మంచి గుర్తింపుని తీసుకొచ్చినా, కమర్షియల్‌గా మాత్రం పెద్ద విజయాలు అందించలేకపోయాయి. అయితే ఈ ప్రయాణంలో తనతో కలిసి పనిచేసిన హీరోల నుంచి ఎంతో నేర్చుకున్నానని తాజాగా భాగ్యశ్రీ చెప్పుకొచ్చింది. రవితేజ నుంచి సహనం, సెట్స్‌లో ఆయన చూపించే ఎనర్జీని నేర్చుకున్నానని ఆమె వెల్లడించింది.



## అనసూయ బ్యాలెన్స్‌డ్ థియరీ



సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ, తన అభిప్రాయాలను కుండబద్దలు కొట్టినట్లు చెప్పే అనసూయ భరద్వాజ్ తాజాగా చేసిన ఇన్ స్టాగ్రామ్ పోస్ట్‌లు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని సున్నితమైన అంశాల మీద ఆమె స్పందించిన తీరు చర్చకు దారితీసింది. సాధారణంగా ఏ చిన్న విషయం జరిగినా అనసూయ స్పందన ఎలా ఉంటుందో అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. అయితే ఈసారి ఆమె చాలా బ్యాలెన్స్‌డ్‌గ తన వివరణ ఇచ్చారు. ప్రజా సమస్యల మీద తనను స్పందించమని కోరడం ఒక రకంగా తనకు దక్కిన గౌరవమని, అదే సమయంలో అది ఒక భారమని అనసూయ పేర్కొన్నారు. ప్రపంచంలో జరిగే ప్రతి విషయం మీద తనకు పూర్తి అవగాహన ఉండకపోవచ్చని, అందుకే అవగాహన లేకుండా ఏ విషయం మీద మాట్లాడటం సరైంది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో ఏదైనా విషయం ట్రెండింగ్‌లో ఉంది కదా అని ఉత్సాహంతో దాని మీద దూకడం తన నైజం కాదని, ఒక మనిషిగా, వర్కింగ్ పేరెంట్‌గా తనకు కొన్ని పరిమితులు ఉంటాయని ఆమె చాలా స్పష్టంగా వివరించారు. ప్రస్తుతం చర్చనీయాంశంగా మారిన ఇష్యూ మీద వస్తున్న వార్తలన్నీ తానూ గమనిస్తున్నానని, కానీ మీడియాలో వచ్చే అప్‌డేట్స్ మాత్రమే చూసి ఒక నిర్ధారణకు రావడం కరెక్ట్ కాదని ఆమె చెప్పారు.



# ముగ్గురు కెప్టెన్లపై వేటు?




## పంత్, అక్షర్, రహానేకు డిమోషన్!

### కీలక మార్పులకు ఫ్రాంచైజీల యోచన

ఐపీఎల్ ప్రస్తుత సీజన్ ముగింపు దశకు చేరుకుంటున్న వేళ, మూడు ఫ్రాంచైజీలలో కీలక మార్పులకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. వరుసగా రెండు సీజన్లలో జట్లను ప్లేఆఫ్స్‌కు చేర్చడంలో దారుణంగా విఫలమైన ముగ్గురు కెప్టెన్ల పదవులకు గండం ఏర్పడింది. ఈ నెలాఖరులో సీజన్ ముగిశాక అక్షర్ పటేల్, రిషభ్ పంత్, అజింక్యా రహానే తమ కెప్టెన్సీలను కోల్పోవడం ఖాయమని ఫ్రాంచైజీ వర్గాల సమాచారం. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఇప్పటికే అధికారికంగా ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో వరుసగా రెండుసార్లు విఫలమైన కెప్టెన్‌గా రిషభ్ పంత్ ముందున్నాడు. ఇక అజింక్యా రహానే నేతృత్వంలోని కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్), అక్షర్ పటేల్ సారథ్యంలోని ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) కూడా దాదాపుగా రేసు నుంచి తప్పుకున్నట్లే. ఈ నేపథ్యంలో వీరి కెప్టెన్సీ భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ప్రదర్శన అత్యంత నిరాశాజనకంగా ఉంది. ఈ సీజన్‌లో 9 ఇన్నింగ్స్‌లలో కేవలం 112.50 స్ట్రైక్ రేట్‌తో 100 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో ఒకే ఇన్నింగ్స్‌లో 56 పరుగులు రాగా, మిగిలిన 8 ఇన్నింగ్స్‌లలో కలిపి కేవలం 44 పరుగులే చేయడం అతని వైఫల్యాన్ని స్పష్టం చేస్తోంది. బౌలింగ్‌లోనూ 12 మ్యాచ్‌లలో 36 ఓవర్లు వేసి 10 వికెట్లు పడగొట్టాడు. ఎకానమీ రేటు (8.08) పర్వాలేదనిపించినా, కీలక సమయాల్లో తనకు తాను తక్కువగా బౌలింగ్ అవకాశాలు ఇచ్చుకోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. వచ్చే సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్య బాధ్యతలు జీఎంఆర్ నుంచి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్‌కు బదిలీ కానున్నాయి. అక్షర్ నాయకత్వ పటిమను నిరూపించుకోవడంలో విఫలమవ్వడం, కీలక నిర్ణయాల కోసం కోచింగ్ సిబ్బంది హేమంగ్ బదానీ, వేణుగోపాల్ రావులపై ఆధారపడటం వంటి కారణాలతో వచ్చే ఏడాది అతను కెప్టెన్‌గా కొనసాగడం అసాధ్యమని ఐపీఎల్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అభిషేక్ పోరెల్ వంటి ప్రతిభావంతుడిని పక్కనపెట్టడం, మాధవ్ తివారీ వంటి ఆల్‌రౌండర్‌ను సరిగ్గా ఉపయోగించుకోకపోవడం వంటి నిర్ణయాలు కూడా అతని కెప్టెన్సీకి మైనస్‌గా మారాయి. 2027 మెగా వేలంలో ఆటగాడిగా అక్షర్‌ను అట్టిపెట్టుకున్నా, కెప్టెన్‌గా మాత్రం అవకాశం లేనట్లే. రిషభ్ పంత్‌కు కెప్టెన్సీ సరిపడటం లేదనేది ఫ్రాంచైజీ క్రికెట్‌లో బహిరంగ రహస్యం. అతనిపై వేల టన్నుల భారం ఉన్నట్లు కనిపిస్తోంది. ఈ సీజన్‌లో 11 మ్యాచ్‌లలో 138 స్ట్రైక్ రేట్‌తో కేవలం 251 పరుగులు చేసి, 9 సిక్సర్లు మాత్రమే కొట్టడం అతని పేలవ ఫామ్‌కు అద్దం పడుతోంది. లక్నో యజమాని సంజీవ్ గోయెంకా భారీ మొత్తం వెచ్చించి ఆటగాళ్లను కొనుగోలు చేస్తారు, కానీ అంతేస్థాయిలో ఫలితాలను ఆశిస్తారు. వరుసగా రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించకపోవడం ఆయనకు తీవ్ర అసంతృప్తిని కలిగించింది. అర్షిన్ కులకర్ణి వంటి ఆటగాడిని ఓపెనర్‌గా పంపడం, దేశవాళీ టీ20లలో 130 కంటే తక్కువ స్ట్రైక్ రేట్ ఉన్న హిమ్మత్ సింగ్‌కు పదేపదే అవకాశాలివ్వడం, ఆయుష్ బదోనిని టాప్ ఆర్డర్‌లో ఆడించడం వంటి వ్యూహాత్మక తప్పిదాలు జట్టు వైఫల్యానికి కారణమయ్యాయి. నికోలస్ పూరన్, మార్క్రమ్ ఫామ్‌లో లేకపోవడం కూడా దెబ్బతీసినప్పటికీ, ఒక కెప్టెన్‌కు ఉండాల్సిన వ్యూహాత్మక చతురత పంత్‌లో లోపించిందని విశ్లేషకులు భావిస్తున్నారు. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో సరైన ప్రత్యామ్నాయం లేకపోవడంతో అజింక్యా రహానేకు కెప్టెన్సీ దక్కింది. అయితే అతని నిదానమైన బ్యాటింగ్ జట్టుకు శాపంగా మారింది. రహానే (237 పరుగులు, 133 స్ట్రైక్ రేట్), మరో టాప్ ఆర్డర్ బ్యాటర్ అంగ్క్రిష్ రఘువంశీ (340 పరుగులు, 139 ప్లస్ స్ట్రైక్ రేట్) ఇద్దరూ కలిసి దాదాపు ప్రతి మ్యాచ్‌లోనూ జట్టు ఊపును దెబ్బతీశారు. ఈ ఇద్దరూ కలిసి 11 మ్యాచ్‌లలో కేవలం 25 సిక్సర్లు మాత్రమే కొట్టారంటే వారి బ్యాటింగ్ తీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. 37 ఏళ్ల వయసులో టీ20 ఫార్మాట్‌కు అవసరమైన వేగాన్ని అందుకోవడంలో రహానే విఫలమవుతున్నాడు. తన స్ట్రైక్ రేట్‌పై విమర్శలు వచ్చినప్పుడు జనాలకు అసూయ అంటూ వ్యాఖ్యానించిన రహానే, ఇప్పుడు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయం వచ్చింది. మొత్తం మీద చూస్తే అక్షర్ పటేల్, రిషభ్ పంత్‌లకు ఆటగాళ్లుగా డిమాండ్ ఉన్నప్పటికీ, వచ్చే మినీ వేలంలో రహానేను కొనుగోలు చేయడానికి ఏ ఫ్రాంచైజీ ముందుకు రాకపోవచ్చని అంచనా.








# పంజాబ్‌కు ప్లేఆఫ్ కష్టాలు

## వరుసగా ఐదో ఓటమి.. ముంబై అద్భుత ఛేదన.. అదరగొట్టిన తిలక్ వర్మ

**పంజాబ్ కింగ్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో ముంబయి ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 201 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన ముంబయి 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. తిలక్ వర్మ (75లి; 33 బంతుల్లో6 ఫోర్లు, 6 సిక్స్‌లు) అదిరే ఇన్నింగ్స్‌తో ముంబయిని గెలిపించాడు.**

**రికెల్టన్ (48; 23 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు ఆరంభాన్ని ఇచ్చాడు. విల్ జాక్స్ (25లి; 10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) చివర్లో దూకుడుగా ఆడాడు. పంజాబ్ బౌలర్లలో ఒమర్జాయ్ 2, యాన్సెన్, చాహల్ ఒక్కో వికెట్ తీశారు. వరుసగా ఐదో ఓటమి చవిచూసిన పంజాబ్ ప్లే ఆఫ్స్ అవకాశాలను సంక్లిష్టం చేసుకుంది.**

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 12 | 8 | 4 | 14 |
| గుజరాత్ | 12 | 8 | 4 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 14 |
| పంజాబ్ | 12 | 6 | 5 | 13 |
| చెన్నై | 11 | 6 | 5 | 12 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| ఢిల్లీ | 12 | 5 | 7 | 10 |
| కోల్‌కతా | 11 | 4 | 6 | 9 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 11 | 3 | 8 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో (ఆర్సీబీ, లఖ్‌నవూతో) గెలిస్తేనే ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరుతుంది. 12 మ్యాచ్‌ల్లో నాలుగో విజయం అందుకున్న ముంబయి ఇప్పటికే ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన సంగతి తెలిసిందే. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 200 పరుగులు చేసింది. ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ సింగ్ (57) అద్భుతమైన హాఫ్ సెంచరీతో రాణించగా, చివర్లో అజ్మతుల్లా ఒమర్జాయ్ (38) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్ నాలుగు వికెట్లతో ఆకట్టుకున్నాడు. టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న ముంబైకి పంజాబ్ ఓపెనర్లు శుభారంభం అందించారు. ముఖ్యంగా ప్రభ్‌సిమ్రన్ సింగ్ కేవలం 32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్సర్లతో 57 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అయితే, ప్రభ్‌సిమ్రన్ ఔటైన తర్వాత పంజాబ్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా తడబడింది. శార్దూల్ ఠాకూర్ తన ఒకే ఓవర్లో శ్రేయస్ అయ్యర్, సూర్యాంశ్ షెడ్గే వికెట్లు తీసి పంజాబ్‌ను దెబ్బకొట్టాడు. దీంతో పంజాబ్ 140 పరుగులకే 7 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో అజ్మతుల్లా ఒమర్జాయ్ అద్భుతంగా ఆడాడు. కేవలం 17 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 38 పరుగులు చేసి జట్టు స్కోరును పెంచాడు. అతనికి తోడుగా విష్ణు వినోద్ (15), జేవియర్ బార్ట్‌లెట్ (18) కూడా చివరి ఓవర్లలో విలువైన పరుగులు జోడించడంతో పంజాబ్ 200 పరుగుల మార్కును అందుకుంది. ముంబై బౌలర్లలో శార్దూల్ 4 వికెట్లు, దీపక్ చాహర్ 2 వికెట్లు తీశారు. కాగా, రెగ్యులర్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోకపోవడం, స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ వ్యక్తిగత కారణాలతో అందుబాటులో లేకపోవడంతో, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా తొలిసారిగా ముంబై జట్టుకు సారథ్యం వహించాడు.

# వైభవ్ ఎంట్రీ

## భారత్, శ్రీలంక, ఆఫ్ఘనిస్థాన్ 'ఏ' ముక్కోణపు సిరీస్

### కెప్టెన్‌గా తిలక్ వర్మ.. వైస్‌గా పరాగ్




వచ్చే నెల శ్రీలంకలో జరగనున్న వన్డే ట్రై-సిరీస్‌లో స్టార్ ఎడమచేతి వాటం ఆటగాడు తిలక్ వర్మ ఇండియా 'ఎ' పురుషుల క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఆఫ్ఘనిస్తాన్ 'ఎ' జట్టు కూడా పాల్గొంటున్న ఈ సిరీస్ కోసం బీసీసీఐ గురువారం భారత ఎ జట్టును ప్రకటించింది. యువ ఆటగాడు రియాన్ పరాగ్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది. దేశవాళీ క్రికెట్‌లో రికార్డులు సృష్టించిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ కూడా భారత్ 'ఏ' జట్టులోకి ఎంపికయ్యాడు. భారత 'ఏ' జట్టులో హిట్టర్లకు కొదవలేదు. ఓపెనర్‌గా అభిషేక్ శర్మ విధ్వంస బ్యాటింగ్‌కు సిద్ధంగా ఉండగా, మిడిల్ ఆర్డర్‌లో ఆయుష్ బదోని, రమణ్‌దీప్ సింగ్ వంటి ఫినిషర్లు ఉన్నారు. బౌలింగ్ విభాగంలో స్పిన్, ఫేస్ విభాగాల్లో యువ ఆటగాళ్లకు పెద్దపీట వేశారు. ఈ ముక్కోణపు సిరీస్ టైటిల్ కోసం మాత్రమే కాకుండా, యువ ఆటగాళ్ళకు సీనియర్ జట్టులోకి వెళ్ళడానికి మంచి అవకాశం. జూన్ 9వ తేదీన ముక్కోణపు పోరు ప్రారంభం కానుంది.



# క్వార్టర్ ఫైనల్స్‌కు సింధు

## రెండో రౌండ్‌లోనే శ్రీకాంత్ ఇంటికి

థాయిలాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ క్రీడాకారిణి పీవీ సింధు క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఉమెన్స్ సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు.. డెన్మార్క్ షట్లర్ అమాలీ షుల్ట్‌ను ఓడించింది. కేవలం 28 నిమిషాల్లోనే ప్రత్యర్థి భరతం పట్టింది. వరుసగా 21-13, 21-15 తేడాతో విజయం సాధించింది. అయితే, క్వార్టర్స్‌లో ఆమె కఠిన సవాల్ ఎదురైంది. వరల్డ్ నం.2 క్రీడాకారిణి అకానె యమగూచి(జపాన్)తో తలపడనుంది. ఇక మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్ కూడా క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. రెండో రౌండ్‌లో అతను చైనాకు చెందిన జు జువాన్ చెన్‌పై 21-12, 21-13 తేడాతో నెగ్గాడు. స్పష్టమైన ఆధిపత్యం ప్రదర్శించిన సేన్ ప్రత్యర్థికి ఎలాంటి అవకాశాలు ఇవ్వకుండా ఏకపక్షంగా మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. మరో స్టార్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారిపట్టాడు. చైనీస్ తైపీ ఆటగాడు సు లి యాంగ్ చేతిలో 16-21, 21-11, 18-21 తేడాతో ఓడిపోయాడు. గంటా 10 నిమిషాలపాటు సుదీర్ఘ సాగిన మ్యాచ్‌లో శ్రీకాంత్ తీవ్రంగానే పోరాడినప్పటికీ ఫలితం దక్కలేదు.

నేటి ఈవార్తలు

సంపాదకీయం

Editorial

# నేటి కుటుంబం.. సమాజం!

మానవ సమాజానికి అత్యంత ప్రాథమిక, బలమైన పునాది కుటుంబం. వ్యక్తుల ఎదుగుదలకు, సామాజిక భద్రతకు కుటుంబ వ్యవస్థే మూలాధారం. మారుతున్న కాలంతో పాటు నేటి ఆధునిక ప్రపంచంలో కుటుంబాల స్వరూపం, ఆలోచనా విధానాలు వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు కలిసి ఉంటే కలదు సుఖం అన్నట్లు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. నేడు ఉపాధి, వ్యక్తిగత స్వేచ్ఛ కారణాల వల్ల చిన్న కుటుంబాలు పెరిగిపోయాయి. భార్యాభర్తలిద్దరూ సంపాదించే కుటుంబాలు పెరిగాయి. ఇది ఆర్థిక భద్రతను ఇస్తున్నప్పటికీ, పరస్పరం గడపడానికి సమయం తగ్గించివేస్తోంది. ఒకే ఇంట్లో, ఒకే గదిలో కూర్చున్నా ఎవరి మొబైల్‌లో వారు మునిగిపోతున్నారు. భౌతిక సామీప్యత ఉన్నా మానసిక దూరాలు పెరుగుతున్నాయి. ఉరుకుల పరుగుల జీవితంలో పిల్లలతో, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులతో నాణ్యమైన సమయాన్ని గడపడం కరువైంది. చిన్న చిన్న విషయాలకే పట్టింపులు పెరిగి, విడాకులు మరియు కుటుంబ కలహాల శాతం విపరీతంగా పెరుగుతోంది. పిల్లలు విదేశాల్లో లేదా ఇతర నగరాల్లో స్థిరపడటంతో వృద్ధ తల్లిదండ్రులు తీవ్రమైన ఒంటరితనానికి, మానసిక వేదనకు గురవుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సంబంధాలను కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రతిరోజూ కనీసం గంట లేదా భోజన సమయంలోనైనా మొబైల్ ఫోన్లను పక్కన పెట్టి, కుటుంబ సభ్యులంతా కలిసి మాట్లాడుకోవాలి. ఇంటి పనులను, బాధ్యతలను కేవలం ఒక్కరిపైనే వేయకుండా అందరూ పంచుకోవడం వల్ల పరస్పర గౌరవం పెరుగుతుంది. లోపాలను ఎత్తిచూపడం మానేసి, ఒకరినొకరు అర్థం చేసుకుని క్షమించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలి. ఆరోగ్యకరమైన కుటుంబాలే ఆరోగ్యకరమైన సమాజానికి నిర్మాతలు. కుటుంబంలో శాంతి, ఆనందం ఉన్నప్పుడే వ్యక్తులు సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తారు. పిల్లలకు చిన్నతనం నుంచే కుటుంబ విలువల ప్రాధాన్యతను, పెద్దలను గౌరవించడాన్ని నేర్పించాలి. అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం కేవలం ఒక రోజు వేడుకగా మిగిలిపోకూడదు. ప్రతి ఇల్లూ ఒక నందనవనంగా మారడానికి, అనుబంధాల రక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి.



# సంధికాలపు సంఘర్షణ

పరుచుకున్న పచ్చదనం పయ్యెదలా పొదువుకుని
సెగల భాష ఓనమాలను పుడమిపై దిగులుగా దిద్దుతూ
ఉక్కపోత భారంతో శిలలా గడ్డకట్టుకుపోతోంది వసంతం.
గ్రీష్మం తొలి స్పర్శకు నిలువునా నెమ్మదిగా కరుగుతూ!

నిప్పుల సూదులతో సిగ్గుల పొరలను మీటి
మోహపు వెల్తురును ఎండమావుల్లా పరిచి
పగిలిన మేనిలో మిగిలిన చల్లదనాన్ని పెదాలతో పిండేసి
ఇద్దరి దేహాల భుగభుగలను ఏర్చికూర్చిన ప్రణయదర్పంతో
మండే వలపుల మహాసౌధాన్ని నిర్మిస్తున్నాడు గ్రీష్ముడు.


జతకూడిన జంట ఉద్వేగపు నిట్టూర్పులను
జగతిపై జ్వాలలుగా వెదజల్లుతూ...
పాదాల కింద నలిగిన పండుటాకుల సన్నని సవ్వడితో
మార్పును వేసవివర్ణంతో ప్రకృతిపై చిత్రంగా చిత్రిస్తూ...
గడియకో గుక్కెడు నీటికై అల్లాడే గువ్వల దాహాన్ని,
మౌనం దాల్చిన కోయిల విషాదాన్ని ఇముడ్చుకుని,
నిర్వికారంగా నవ్వుతోంది కాలం.
ఓ రుతువు తాపంలో
మరో రుతువు లీనాన్ని
విలాసంగా వినోదిస్తూ...

ఆ వింతనాటకంలో..
నిప్పులు కురిపించే సూరీడి కింద రాలే శ్రామికుడి స్వేదం,
రాబోయే తొలకరి కోసం ఆకాశంవైపు ఆశగా చూస్తుంటే,
పగటి వడగాడ్పులతో అలసిన దేహాలకు ఉపశమనంగా,
చీకటి పడగానే వెన్నెల చల్లదనాన్ని, మల్లెల పరిమళాన్ని కప్పుకుని
వస్తున్నాయి వైశాఖరాత్రులు.
రానున్న జ్యేష్ఠానికి సుమధుర స్వప్నాల సుగంధాలు
పంచేందుకు!

ఒక చేత్తో వేప చేదు పాఠాలను పదిలంగా దాచుకుని,
మరో చేత్తో మామిడిపండు మాధుర్యాన్ని అందుకుని,
ముగుస్తున్న మురిపానికీ –మొదలయ్యే మంటకు మధ్య
సమతుల్య సూత్రాన్ని నరనరానా ఇంకిస్తోంది వైశాఖం.
జీవితం ఎప్పుడూ ఒకే రంగులో ఉండదన్న సత్యాన్ని
మన మది గదిలో పదిలంగా లిఖిస్తోంది.
సంధికాలమనే కలంతో..

–శ్రీను పైండ్ల
నారపల్లి, ఘట్కేసర్ మండలం, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా
ఫోన్ నంబర్: 9394450105

# తెలుగుకు ఆంగ్ల గ్రహణం



భాష అనేది కేవలం భావవ్యక్తీకరణకు ఉపయోగపడే సాధనం మాత్రమే కాదు. అది ఒక జాతి సంస్కృతికి, చరిత్రకు, జీవన విధానానికి సజీవ సాక్ష్యం. అటువంటి ప్రాచీన, విశిష్టమైన తెలుగు భాష నేడు స్వరాష్ట్రంలోనే పరాయికరణకు గురవుతోంది. ఆధునికత, గ్లోబలైజేషన్ ఉచ్చులో పడి నేటి తరం మాతృభాషకు దూరం కావడం అత్యంత ఆందోళన కలిగించే అంశం. విద్యావంతులమని చెప్పుకునే నేటి యువతలో అత్యధికులకు తెలుగు చదవడం, రాయడం రాకపోవడం అక్షరాలా ఒక సామాజిక విషాదం



శశిధర్ అక్కెల

ప్రస్తుత సమాజంలో ఆంగ్ల వ్యామోహం ఒక మబ్బులా కమ్మేసింది. కార్పొరేట్ విద్యాసంస్థల ఒత్తిడి, తల్లిదండ్రుల మితిమీరిన ఆకాంక్షల వల్ల పిల్లలు అమ్మ అని పిలవడానికి బదులు 'మమ్మీ' అనే సంస్కృతికి అలవాటు పడిపోయారు. ఇంట్లో కూడా పిల్లలతో ఇంగ్లిషులోనే మాట్లాడటాన్ని ఒక హోదాగా భావించే రుగ్మత పెరిగిపోయింది. ఫలితంగా, తెలుగులో మాట్లాడితే వెనుకబడినట్లు, ఆంగ్లంలో మాట్లాడితేనే నాగరికులుగా గుర్తింపు లభిస్తుందనే తప్పుడు సంకేతాలు సమాజంలో బలంగా నాటుకుపోతున్నాయి. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో తెలుగు మాట్లాడేవారే కరువయ్యే ప్రమాదం పొంచి ఉంది.

మన పొరుగున ఉన్న దక్షిణాది రాష్ట్రాలను చూసైనా మనం పాఠాలు నేర్చుకోవలసి ఉంది. తమిళనాడులో తమ భాషా రక్షణ కోసం, అస్తిత్వం కోసం ప్రజలు, ప్రభుత్వాలు ఎంతగానో పోరాడతాయి. కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో కూడా కన్నడ, మలయాళ భాషలను అక్కడి ప్రజలు గర్వంగా గుండెల్లో దాచుకుంటున్నారు. ఉత్తరాది రాష్ట్రాలలో సైతం హిందీ లేదా వారి ప్రాంతీయ భాషల పట్ల అపారమైన గౌరవం కనిపిస్తుంది. కానీ, రెండు తెలుగు రాష్ట్రాల్లో మాత్రం అధికార భాషా సంఘాలు ఉన్నప్పటికీ, చట్టాలు చేస్తున్నప్పటికీ ఆచరణలో చిత్తశుద్ధి లోపిస్తోంది. పరభాషను నేర్చుకోవడం తప్పు కాదు, కానీ పరభాష కోసం మాతృభాషను బలిపెట్టడం ముమ్మాటికీ ఆత్మహత్యాసదృశ్యమే అవుతుంది. భాష చచ్చిపోతే ఆ భాషకు సంబంధించిన శతాబ్దాల సాహిత్యం, చరిత్ర, మూలాలు అంతరించిపోతాయి. మన పద్యాలు, సామెతలు, జాతీయాలలో దాగి ఉన్న జీవన సత్యాలను నేటి తరం కోల్పోతోంది. మాతృభాషలో కాకుండా పరభాషలో ప్రాథమిక విద్యనభ్యసించడం వల్ల పిల్లల్లో సహజమైన ఆలోచనా శక్తి, సృజనాత్మకత దెబ్బతింటున్నాయని మానసిక శాస్త్రవేత్తలు సైతం హెచ్చరిస్తున్నారు. ఈ విపత్కర పరిస్థితి నుంచి తెలుగును కాపాడుకోవడానికి తక్షణ కర్తవ్యంగా కొన్ని గట్టి చర్యలు చేపట్టాలి. ప్రాథమిక విద్య కచ్చితంగా తెలుగు మాధ్యమంలోనే సాగేలా ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయాలి. ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలు, అధికారిక కార్యక్రమాలు వంద శాతం తెలుగులోనే జరగాలి. యువత కూడా సామాజిక మాధ్యమాల్లో ఆంగ్ల లిపిని (ఇంగ్లీష్ అక్షరాలతో తెలుగు రాయడం) పక్కన పెట్టి, తెలుగు లిపిని వాడటం అలవాటు చేసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రతి ఇల్లు ఒక తెలుగు పాఠశాల కావాలి. మాతృభాషను గౌరవించడం ఇంట్లోనే ప్రారంభం కావాలి. తెలుగు కేవలం ఒక భాష కాదు, అది మన అస్తిత్వం. దాన్ని రక్షించుకోవడం మనందరి చారిత్రక బాధ్యత.

నేటి తెలుగు యువతకు సొంత భాష రాయడం, చదవడం రావడం లేదు. కార్పొరేట్ చదువులు, ఆధునిక జీవనశైలి మాతృభాషను చిన్నచూపు చూసేలా చేస్తున్నాయి. తెలుగులో మాట్లాడితే వెనుకబడినట్లు, ఆంగ్లంలో మాట్లాడితే నాగరికులుగా భావించే రుగ్మత పెరిగింది. ఇంట్లో కూడా పిల్లలతో ఆంగ్లంలోనే మాట్లాడే తల్లిదండ్రుల సంఖ్య పెరుగుతోంది. తమిళులు తమ భాషా రక్షణకు, సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. కన్నడ, మలయాళ భాషలను అక్కడి ప్రజలు గర్వంగా గుండెల్లో దాచుకుంటున్నారు. హిందీ మాట్లాడే రాష్ట్రాలు తమ ప్రాంతీయ అస్తిత్వాన్ని ఎక్కడా కోల్పోవడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో అధికార భాషా సంఘాలు ఉన్నా కార్యాచరణ లోపించింది. భాష చచ్చిపోతే ఆ భాషకు సంబంధించిన శతాబ్దాల సాహిత్యం, చరిత్ర అంతరించిపోతాయి. తెలుగు పద్యాలు, సామెతలు, జాతీయాలు తెలియని పరాయిలుగా యువత మారుతోంది. మాతృభాషలో కాకుండా పరభాషలో చదవడం వల్ల సృజనాత్మకత దెబ్బతింటుంది. ప్రాథమిక విద్య కచ్చితంగా తెలుగు మాధ్యమంలోనే సాగాలి. ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలు, అధికారిక కార్యక్రమాలు వంద శాతం తెలుగులోనే జరగాలి. సామాజిక మాధ్యమాల్లో తెలుగు లిపిని వాడటం అలవాటు చేసుకోవాలి. ప్రతి ఇల్లు ఒక తెలుగు పాఠశాల కావాలి, పిల్లలకు తెలుగు చదవడం నేర్పించాలి. తెలుగు కేవలం ఒక భాష కాదు, అది మన జాతి జీవన విధానం. దాన్ని కాపాడుకోవడం మనందరి చారిత్రక అవసరం.

# 'కవి'తాంతరంగం!

వాక్యాన్ని ముగించినట్లు
ఏ కవితను ముగించలేడు
ప్రతి పద్యమూ
కవితాంతరంగా శకలమే!
ముగించిన ప్రతిసారి
ఒక మెరుపు ఒక తరంగం
కవిని వెన్నాడుతూనే ఉంటుంది
కవి కళ్ళ ముందు
కాలం పెద్ద మాయల మరాఠీ
ఎంత రాసినా
కవి అలసిపోవలసిందే
దృశ్యాలకు కొదవుండదు
రోజూ పూచే ఉదయాస్తమయాలు
కవికెప్పుడూ సంభ్రమాశ్చర్యాలే
ప్రేమ ఒక్కటే
అల్లికలు అనంతం
యుద్ధ రూపమొక్కటే
దుఃఖ తరంగాలు అనేకం
అన్ని అనుభవాలు
కవికి నిద్రను దూరం చేసేవే
నిత్యం కలమెత్తడమంటే మాటలు కాదు
కవి తన చితిని తానే పేర్చుకోవడం
విశ్వ శ్రేయస్సు ఎన్నటికీ
కవిని కలవర పెట్టే కలనే
భూగోళం మీద జరిగే యుద్ధాలు
రాజ్యాధినేతల స్వార్థ ప్రేరితాలు
కవి హృదయమంతా
నిరంతర యుద్ధ క్షేత్రమే
సమ సమాజ స్థాపనే కవి పోరు లక్ష్యం!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261.





# వృద్ధాప్య శిశువులు

కంటిచూపు ఆననోళ్లు
ఆశలన్నీ రాలినోళ్లు
మతిమరుపు వరమైనోళ్లు
రెండో బాల్యం పొడచూపిన
పండుటాకులు

వీరు తాము కన్నకొడుకులకు
కొడుకులాంటి వాళ్లు
తమపిల్లలవోలే
ప్రేమగా చూడవలసిన పెద్దవాళ్లుకు
మనమే అమ్మానాన్నలము

జాలిగా మన వైపు
చూసెటోళ్లు
ఎన్నోబాధలు అనుభవించినోళ్లు

స్వార్థపరులైన
కొడుకు కోడళ్ల
ఆరళ్ళకు బలైపోయినోళ్లు

ఉన్నదంతా తమ పిల్లలకు పంచి
చేతిలో చిల్లిగవ్వలేనోళ్లు
వృద్ధాశ్రమంలో తలదాచుకునేవాళ్లు

ఆకలి రోగాన్ని జయించలేక
కంచంలో కూడువేసే నాథుడే కరువై
వీధి వీధి తిరిగి
భిక్ష మెత్తే
అందరున్నా ఎవరూ లేని
అనాథలు వారు
ధనమున్న నిర్భాగ్యులువారు.

అంకాల సోమయ్య
దేవరుప్పుల, జనగామ
9640748497

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.